
ఆంధ్రజ్యోతి



ANDHRAJYOTHY
ఖమ్మం
KHAMMAM
గురువారం, 21 నవంబరు 2024



మోడిఫైడ్ సైలెన్సర్లకు చెక్

బుల్లెట్ వాహనాలకు మోడిఫైడ్ సైలెన్సర్లు అమర్చి న్యూసెన్స్ క్రియేట్ చేస్తున్న వారిపై ట్రాఫిక్ పోలీసులు కొరడా ఝుళిపించారు. ప్రత్యేక డ్రైవ్‌లో భాగంగా బుధవారం 30 వాహనాలను పట్టుకొని, వాటికి అమర్చిన మోడిఫైడ్ సైలెన్సర్లు తొలిగించారు. అనంతరం ఒక్కో వాహనదారుడికి రూ.1000 చొప్పున జరిమానా విధించారు. ఈ డ్రైవ్‌లో ట్రాఫిక్ సీఐ మోహనబాబు, ఆర్ఐ సాంబశివరావు, ఎస్ఐ రవి, సాగర్, వెంకన్న పాల్గొన్నారు.

-ఆంధ్రజ్యోతి, ఖమ్మం క్రైం



ఆలోచనాత్మకం.. 'సంఘం శరణం గచ్ఛామి'

హైదరాబాద్‌కు చెందిన అభ్యుదయ ఆర్ట్స్ అకాడమీ వారు బుధవారం రాత్రి నగరంలోని భక్త రామదాసు కళాక్షేత్రంలో ప్రదర్శించిన 'సంఘం శరణం గచ్ఛామి' నాటకం ఆలోచింప చేసింది. విద్య ద్వారా సామాజిక వివక్షలను తిప్పి కొట్టవచ్చని సందేశం ఇచ్చారు. కళాకారులు తమ నటనతో పాత్రలకు జీవం పోశారు. నగరానికి చెందిన కె.దేవేంద్ర రచించిన ఈ నాటకానికి తూము శివప్రసాద్ దర్శకత్వం వహించారు.

-ఆంధ్రజ్యోతి, ఖమ్మం సాంస్కృతికం



ఐదుగురికి ఏఎస్సైలుగా ప్రమోషన్

ఖమ్మం పోలీసు కమిషనరేట్‌లో ఐదుగురు హెడ్‌కానిస్టేబుల్స్.. ఏఎస్ఐలుగా పదోన్నతి పొందారు. వీరిని పోలీస్ కమిషనర్(సీపీ) సునిల్‌దత్ బుధవారం అభినందించారు. అసిస్టెంట్ సబ్ ఇన్‌స్పెక్టర్(ఏఎస్ఐ) పదోన్నతి పొందిన వారిలో ఎస్కే నూరుద్దీన్, కె.నాగేశ్వరరావు, బీవీఆర్ రాజు, ఐ.చిన్నారావు, ఎస్.శ్రీనివాసరావు ఉన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు డీసీపీ ప్రసాదరావు పాల్గొన్నారు. పలువురు వారికి శుభాకాంక్షలు తెలిపారు.

- ఆంధ్రజ్యోతి, ఖమ్మం క్రైం

కమీషన్ కోసం వ్యాపారుల కట్టు



పత్తి కొనుగోళ్లలో నిబంధనలు చిత్తు

- యథేచ్ఛగా వ్యవహరిస్తున్న కమీషన్ ఏజెంట్లు
- ఇష్టారాజ్యంగా కమీషన్ వసూలు
- లైసెన్సు లేకపోయినా దర్జాగా దందా
- నష్టపోతున్న రైతులు
- చోద్యం చూస్తున్న మార్కెటింగ్ శాఖ అధికారులు

ఖమ్మం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఉమ్మడి ఖమ్మం జిల్లాలో పత్తి కొనుగోళ్లు ముమ్మరంగా సాగుతున్న నేపథ్యంలో కమీషన్ల దందా కూడా జోరుగానే సాగుతోంది. కొందరు లైసెన్సులు లేకుండా పత్తి కొనుగోళ్లు సాగిస్తుండగా, మరికొందరు మార్కెటింగ్‌శాఖ నిర్ణయించిన కమీషన్ కంటే అదనంగా వసూలు చేసి దందా సాగిస్తున్నారు. దీంతో వ్యాపారులకు, రైతులకు మధ్య రగడ తలెత్తుతోంది. రాష్ట్రంలో పత్తి సాగులో ఉమ్మడి ఖమ్మంజిల్లాకు ప్రత్యేకత ఉంది. సుమారు మూడున్నర లక్షల ఎకరాలపైగా ఉమ్మడి జిల్లాలో పత్తి సాగవుతుంది. ప్రతిఏటా వేల కోట్ల రూపాయల పత్తి జిల్లానుంచి తరలిపోతోంది.

గుంటూరు, కోయంబత్తూరు, గుజరాత్, మహారాష్ట్ర తదితర ప్రాంతాలకు ఇక్కడి నుంచి పత్తి ఎగుమతి అవుతోంది. జిన్నింగ్ అనంతరం ఇతర దేశాలకు కూడా పత్తి ఎగుమతి చేస్తున్నారు. జిల్లాలో ఎర్రనేలల్లో పత్తిపంట అధికంగా (మిగతా 6వ పేజీలో)

- జూలూరుపాడు మార్కెట్ యార్డులో పత్తి కొనుగోళ్ల నిలిపివేత
- ఆగ్రహంతో రోడ్డెక్కిన రైతులు
- రెండు గంటల పాటు రాస్తారోకో
- పాత పద్ధతిలోనే కొనుగోలు చేయాలని డీఎంఓ సూచన
- చివరకు కొనుగోళ్లకు అంగీకరించిన వ్యాపారులు



జూలూరుపాడులో రాష్ట్రీయ రహదారిపై రాస్తారోకో చేస్తున్న రైతులు

జూలూరుపాడు, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): జూలూరుపాడులోని ఉపమార్కెట్ యార్డు బుధవారం అట్టుడికింది. అధికారులు విధించిన నిబంధనలను వ్యతిరేకిస్తత వ్యాపారులు పత్తి కొనుగోళ్లను నిలిపివేయగా, వ్యాపారుల తీరును నిరసిస్తూ రైతులు ఆందోళనకు దిగారు. వివరాల్లోకి వెళ్లితే.. ఖమ్మం జిల్లాలోని ఏన్కూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో జూలూరుపాడులోని ఉపమార్కెట్ యార్డులో పత్తి కొనుగోళ్లు నిర్వహిస్తున్నారు. ఏన్కూర్ మార్కెట్ కమిటీ కార్యాలయంలో మంగళవారం జూలూరుపాడుకు చెందిన వ్యాపారులతో ఖమ్మం జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారి ఎంఎ అలీమ్, కల్లూరు ఆర్డీవో రాజేంద్రగౌడ్‌లు సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో రైతుల నుంచి కొనుగోలు చేసే పత్తిలో తారం (క్వింటాకు 2కేజీలు) తీయవద్దని, కమీషన్(నూటికి రెండు శాతం) తీసుకోవద్దని వ్యాపారులను ఆదేశించారు. అయితే ఈ నిబంధనలతో తమకు నష్టం కలుగుతుందని, తాము పత్తి కొనుగోళ్లు చేయలేమని వ్యాపారులు కొనుగోళ్లు నిలిపివేశారు. తారం కానీ, కమీషన్ కానీ రెండిట్లో ఒకటి అమలు చేయలని, అలా అయితేనే తాము పత్తి కొనుగోలు చేస్తామని వ్యాపారులు తేల్చి చెప్పారు.

కాగా, జూలూరుపాటు మార్కెట్ సిబ్బంది బుధవారం ఉదయం జెండా పాట ఏర్పాటు చేయగా వ్యాపారులు ముందుకు రాలేదు. దీంతో పత్తి కొనుగోళ్లు ఎందుకు కొనుగోలు చేయడం లేదని ఏన్కూర్ మార్కెట్ కమిటీ సూపర్‌వైజర్ రామారావు అడగగా అధికారులు విధించిన నిబంధనలతో తాము పంట కొనుగోళ్లు చేసి నష్టపోలేమని వ్యాపారులు తెలిపారు. ఎలాంటి ప్రకటన చేయకుండా కొనుగోళ్లు నిలిపేయడం తగదని, రైతులను ఇబ్బందులకు గురిచేయవద్దని సూపర్‌వైజర్ వ్యాపారులకు సూచించారు. అయినా వారు ముందుకు రాలేదు. దీంతో వ్యాపారుల తీరును నిరసిస్తూ రైతులు ఆందోళనకు దిగారు. ఈ ఆందోళనకు సీపీఐ, సీపీఎం మద్దతు తెలిపాయి.. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన రైతులు, వామ పక్ష పార్టీల నాయకులు ఉపమార్కెట్ యార్డు సమీపంలోని కొత్తగూడెం-ఖమ్మం రాష్ట్రీయ రహదారిపై బైఠాయించి రాస్తారోకో చేశారు. రెండు గంటల పాటు ఆందోళన కొనసాగించటంతో రెండు కి.మీ. మేర ట్రాఫిక్‌జామ్ అయ్యింది.

కాంగ్రెస్ జిల్లా నాయకుడు కోనేరు సత్యనారాయణ రైతుల సమస్యను కలెక్టర్ జితేష్ వి పాటిల్, వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్‌నాయక్ దృష్టికి తీసుకువెళ్లారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్తామని చెప్పినా రైతులు వినలేదు. ఈ క్రమంలో పోలీసులు, మార్కెట్‌కమిటీ సూపర్‌వైజర్ రామారావు కలిసి పత్తి కొనుగోలు చేయాలని వ్యాపారులకు సూచించారు. అయినా వ్యాపారులు అంగీకరించలేదు.

దీంతో సమస్యను ఖమ్మం డీఎంవో అలీమ్ దృష్టికి తీసుకెళ్లారు. బుధవారం పాత పద్ధతిలోనే కొనుగోలు చేయాలని డీఎంవో వ్యాపారులకు సూచించడంతో వారు అంగీకరించారు. దీంతో రైతులు ఆందోళనను విరమించారు. పత్తి కొనుగోళ్లు నిలిపివేయడంతో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన రైతులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. రైతుల ఆందోళన విషయం తెలుసుకున్న కొత్తగూడెం డీఎస్పీ అబ్దుల్ రహమాన్ ఉపమార్కెట్ యార్డు వద్దకు చేరుకుని ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండాచర్యలు తీసుకున్నారు.

కాగా ఖమ్మం జిల్లా మార్కెటింగ్ శాఖాధికారి ఎంఎ అలీమ్ బుధవారం ఉపమార్కెట్ యార్డును సందర్శించి వ్యాపారులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యాపారులు నిబంధనలతో తమకు కలుగుతున్న నష్టం గురించి ఆయనకు తెలియజేశారు. దాంతో పది రోజుల పాటు పాత పద్ధతిలోనే వ్యాపారులు పత్తిని కొనుగోలు చేపట్టాలని, రైతులకు ఇబ్బంది కలిగించవద్దని సూచించారు.



కొనుగోళ్ల కోసం వేచి చూస్తున్న పత్తి వాహనాలు



పత్తి కొనుగోళ్ల తూకంలో మోసం

- అధిక ధర ఇవ్వడంతో అనుమానం
- నలుగురు వ్యక్తులను చితకబాదిన రైతులు

6



దళారీ వ్యవస్థను అరికట్టండి..

- సిండికేట్‌గా ఏర్పడుతున్న వ్యాపారులు
- ఐటీడీఏ పీవోకు గిరిజన సంఘాల వినతి

6

దివ్యాంగులకు పెంచిన పింఛన్లు అమలు చేయాలి

- లేకపోతే 26న హైదరాబాద్‌లో మహాధర్నా
- ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ



రిలే నిరాహార దీక్ష శిబిరం వద్ద మాట్లాడుతున్న మంద కృష్ణమాదిగ

ఖమ్మం చర్చికాంపౌండ్, నవంబరు20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం దివ్యాంగుల పింఛన్ల పెంపును అమలు చేయకపోతే ఈనెల 26న హైదరాబాదులో దివ్యాగులతో భారీ ర్యాలీ నిర్వహించి మహాధర్నా నిర్వహిస్తామని ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ హెచ్చరించారు. బుధవారం నగరంలోని కలెక్టరేట్ వద్ద వికలాంగుల హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన రిలే నిరాహారదీక్షలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా కృష్ణమాదిగ మాట్లాడుతూ ప్రభుత్వం పింఛన్‌దారులకు పింఛన్‌పెంపుదల చేయకుండా మొండిచేయి చూపిందన్నారు. దీంతో దివ్యాంగులు, వృద్ధులు, ఇతర రకాల పింఛన్‌దారులు తీవ్రంగా నష్టపోతున్నారని తెలిపారు. డిసెంబరు 3న దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా పెంచిన పింఛన్ రూ.6వేలు ఇవ్వాలన్నారు.

తెలంగాణ ప్రభుత్వం ఆసరా పింఛన్లకు అందించాల్సిన డబ్బును రైతులకు, రైతురుణ మాఫీకి అందించడం సరికాదన్నారు. గత ప్రభుత్వాలు పింఛన్‌దారులకు హామి ఇచ్చిన నెలరోజుల్లోనే పింఛన్లు పెంచి అందించారన్నారు. కానీ తెలంగాణ ప్రభుత్వం హామి ఇచ్చి ఏడాది కావస్తున్నా పింఛన్ అందించడం మీనమేషాలు లెక్కిస్తుందన్నారు. ఈనెల 26న హైదరాబాదులో జరిగే మహాధర్నాకు దివ్యాంగులు, ఇతర పింఛన్‌దారులు హాజరై విజయవంతం చేయాలన్నారు. ఈకార్యక్రమంలో ఎంఆర్‌పీఎస్ నాయకులు తూరుగంటి అంజయ్య, ఏపూరి వెంకటేశ్వరరావు, వెంకటేశ్వర్లు, సీతారాములు, బొజ్జ జీవరత్నం, నాగరాజు పాల్గొన్నారు.

వాహనాల వేలంలో 'చీప్' ట్రిక్

- వేలంపాట పాడి తర్వాత చేతులెత్తేసిన వ్యక్తి
- తక్కువ ధరకు కొట్టేయడానికి ప్లాన్.. చెక్ పెట్టిన అధికారులు...

ఖమ్మం సంక్షేమ విభాగం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): అన్నం పెడుతున్న శాఖకే కన్నం వేయాలని ప్రయత్నించారు కొంత మంది ఎక్సైజ్ శాఖ ఉద్యోగులు. ఎక్సైజ్ శాఖ వేలంలో ఓ ప్రైవేట్ వ్యక్తితో వాహనం పాట పాడించి, తిరిగి ఆ ధర చెల్లించలేనని అదే వ్యక్తితో చెప్పించి తక్కువ ధరకే కొట్టేయాలని ప్రయత్నించారు. అయితే అందుకు ఉన్నతాధికారులు అంగీకరించకపోవటంతో కథ అడ్డం తిరిగింది. వివరాలు ఇలా వున్నాయి..

ఖమ్మం ఎక్సైజ్ రెండో పట్టణ పరిదిలో బుధవారం వాహనాలకు వేలం పాట నిర్వహించారు. అయితే వేలం పాటలో ఓ ప్రైవేట్ వ్యక్తి వెనుక ఉండి ఎక్సైజ్ ఉద్యోగులు పరోక్షంగా పాల్గొని వాహనాలను తక్కువగా కొనుగోలు చేస్తారని ఆరోపణలు ఉన్నాయి. బుధవారం నిర్వహించిన వేలం పాటలో మొత్తం 11 వాహనాలను అధికారులు ప్రకటించారు. వీటిలో రెండు నాలుగు చక్రాల వాహనాలు కాగా, మిగిలినవి ద్విచక్ర వాహనాలున్నాయి. నాలుగు చక్రాల వాహనాల్లో వ్యాన్‌ను ఓ వ్యక్తి బహిరంగ వేలంలో రూ. 1,89,000కు కైవసం చేసుకున్నాడు. వేలంలో పాల్గొన్న అందరూ వెళ్లిన తర్వాత, తాను రూ.50వేల నుంచి రూ.70 వేల వరకు మాత్రమే ఇస్తానని పేచీ పెట్టాడు.

ఈ తతంగం వెనుక వేలం పాట నిర్వహించిన సిబ్బంది ఉన్నారని చర్చ జరిగింది. వేలంలో ఎక్కువ ధరకు వాహనం పొంది ఇప్పుడు తక్కువ ధర ఇస్తామని చెప్పటాన్ని ఎక్సైజ్ శాఖ ఏఈఎస్ అంగీకరించలేదు. తిరిగి అదే వాహనానికి సాయంత్రం మరో సారి వేలం పాట నిర్వహించారు. రూ.1,35,000కు మరో వ్యక్తి కొనుగోలు చేశాడు. ఒకే వాహనానికి ఒకే రోజు రెండు సార్లు వేలం నిర్వహించటం ఎక్సైజ్ శాఖలో తొలిసారి వేలంలో ఏఈఎస్ వేణుగోపాల్ రెడ్డి, సీఐ బి.చంద్రమోహన్ పాల్గొన్నారు.



మెనూ ప్రకారం భోజనం అందించాలి

- తప్పనిసరిగా నాణ్యత ప్రమాణాలు పాటించాలి
- ఫుడ్ కమిషన్ సభ్యులు ఓరుగంటి ఆనంద్, జ్యోతి

వివరాలు : 6లో

మిర్చి రైతుకు సాగునీటి కష్టాలు

- ఎకరాకు రూ.10 వేలు చెల్లించి నీటి కొనుగోలు
- కాలువలు సరిగా లేక అందని ఎన్నెస్పీ నీరు
- తల్లాడ మండలంలో అన్నదాతల దుస్థితి

తల్లాడ, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): నాగార్జునసాగర్ ప్రాజెక్టు (ఎన్నెస్పీ) కాలువల నిర్వహణ సక్రమంగా లేకపోవడంతో మెట్ట పంటల రైతులు నానా కష్టాలు పడుతున్నారు. ఈ సారి వర్షాలు సమృద్ధిగా కురిసి, జలాశయాల్లో నీటి నిల్వలు వున్నా సాగునీటి కొరత ఎదురవుతోంది. మిర్చి పంటను కాపాడుకునేందుకు రైతులు సాగునీటిని కొనాల్సిన దుస్థితి ఏర్పడింది. వ్యవసాయ బోర్లలో నీరు వున్న రైతులకు ఎకరాకు రూ.10 వేల చొప్పున చెల్లిస్తూ రైతులు సాగునీరు పొందుతున్నారు. ఈ పరిస్థితి తల్లాడ మండలంలోని మల్లవరం, మంగాపురం, బాలపేట, అన్నారుగూడెం తదితర గ్రామాల్లో దాదాపు 200 ఎకరాల్లో నెలకొంది.

ఎన్నెస్పీ ఆయకట్టు పరిధిలోని మెట్ట భూములకు సాగునీరు సక్రమంగా అందకపోవడంతో మిర్చి సాగు చేసిన రైతులు ఆందోళన చెందుతున్నారు. కొన్నాళ్లుగా ఫీడర్, మైనర్ కాలువల నిర్వహణ సక్రమంగా లేదు. ఈ సమస్య వల్ల నిర్దేశిత క్యూసెక్కుల నీటిని అధికారులు కాలువలకు విడుదల చేయడం లేదు. దీంతో మిర్చి రైతులు వ్యవసాయ బోర్, విద్యుత్ మోటర్ ఉన్న ఇతర రైతులపై ఆధారపడాల్సి వస్తున్నది. సాధారణంగా మిర్చి పంటకు ఆరు నెలల పాటు సాగునీరు అవసరముంటుంది. నెలకు మూడు సార్లు(తడులు) చొప్పున ఆరు నెలల పాటు 18 నుంచి 20 సార్లు మిర్చి పైరుకు సాగునీరు అందించాల్సి ఉంటుంది. కానీ, ఎన్నెస్పీ కాలువల నుంచి నిరంతరంగా నీరు పొందే సౌకర్యం లేకపోవడంతో రైతులు నీటి సామర్థ్యం ఉన్న బోర్ కలిగివున్న వారిపై ఆధారపడి ఎకరాకు రూ. 10 వేల చొప్పున చెల్లించి సాగునీరు కొనుగోలు చేస్తున్నారు. ఇప్పటికైనా ఎన్నెస్పీ కాలువలకు



మిర్చితోటకు నీరు మళ్లిస్తున్న రైతు

మిర్చి సాగుకు నీరు కొనుగోలు చేశా...

30కుంటల విస్తీర్ణంలో మిర్చి సాగుచేశాను. ఎన్నెస్పీ ఆయకట్టు పరిధిలో పొలం ఉన్నప్పటికీ మిర్చి పైరుకు సరిపడా సాగునీరందే పరిస్థితి లేదు. మిర్చి పంటను కాపాడుకొనేందుకు 18నుంచి 20సార్లు నీరు అందించాల్సి ఉంటుంది. దీని దృష్ట్యా మాపొలం సమీపంలోని బోర్ ఉన్న రైతుకు రూ. 7వేలు చెల్లించి మిర్చిపైరుకు నీరందిస్తున్నాను.

- దుగ్గిదేవర తిరుపతిరావు, రైతు, మల్లవరం





పత్తిని వ్యాన్‌లో లోడ్ చేస్తున్న వ్యాపారులు

పత్తి ధరపై.. ప్రైవేటు కత్తి

- మద్దతు ధరకంటే చాలా చౌకగా కొనుగోలు
- దళారుల పంట పండుతోంది..
- గ్రామాల్లో కొనసాగుతున్న వ్యాపారుల జోరు..
- పెట్టుబడుల పేరిట ముందస్తు ఒప్పందాలు
- సీసీఐ కొనుగోలు కేంద్రాలు లేని ఫలితం

మణుగూరు టౌన్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): రైతుల ఆరుగాలం కష్టం దళారుల పాలవుతోంది. రైతులకు ఎంతో మేలు చేస్తున్నామని గొప్పలు చెప్పుకొంటున్న ప్రభుత్వాలు అధికారులు ఎవరూ ఏమీ చేయలేని పరిస్థితి. అందుబాటులో మార్కెట్ సౌకర్యాలు కల్పించడంలో అంతా విఫలమయ్యారు. తప్పని పరిస్థితుల్లో దళారులకే రైతులు పంటను అమ్ముకోవాల్సిన దుస్థితి నెలకొంటుంది.

రైతుల వెన్నంటే వ్యాపారులు...

ఈ ఏడాది పత్తి సాగు పరిశీలిస్తే అధికారిక లెక్కల ప్రకారం 3,200 ఎకరాల్లో 1100 మంది రైతులు పత్తిని సాగుచేశారు. నేటివరకు మణుగూరు మండలంలో కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయనందున దళారులే రైతులకు దిక్కు అవుతున్నారు. మండల కేంద్రంలో ఉన్న ఓ మార్కెట్ యార్డు నిరుపయోగంగా ఉంది. ధాన్యం కొనుగోలుకు మహిళా సంఘాలు ఉన్నా పత్తి కొనుగోళ్లకు దళారులే శరణ్యం అవుతున్నారు. ఆది నుంచి గ్రామాల్లో వ్యాపారులు రైతుల వెన్నంటే ఉంటున్నారు. విత్తనాలు ఎరువులు సహా అన్నింటికీ రైతులకు పెట్టుబడులు పెడుతుండటంతో రైతులు వారికి అనివార్యంగా తమ పంటను విక్రయించుకోవాల్సిన పరిస్థితులు నెలకొంటున్నాయి.

మద్దతు ధర కన్నా తక్కువకు..

ములుగు, వరంగల్, భూపాలపల్లి జిల్లాల నుంచి వ్యాపారులు వస్తున్నారు. రైతుల ముంగిళ్లలోకి నేరుగా వెళుతున్న దళారులు డబ్బులు చెల్లిస్తున్నారు. ఏదో ఓ రోజు వారే వచ్చి పత్తిని తీసుకెళుతున్నారు. దీంతో రైతులకు ఎలాంటి బాధలు ఉండవు. ప్రభుత్వం ఇచ్చే మద్దతు ధర కన్నా దళారులు ఇచ్చే ధర తక్కువే అయినా రైతులు వారికే మొగ్గు చూపుతున్నారు. పినపాక నియోజకవర్గంలో 200 మంది పత్తివ్యాపారులు ఉంటారు. గ్రామాల్లో కొనుగోలు చేస్తున్న దళారులను పట్టించుకునే వారే లేరు. లాభార్జనే ధ్యేయంగా వ్యాపారులు రైతులకు అధిక వడ్డీలకు పెట్టుబడులు పెట్టి నిలువు దోపిడీ చేస్తున్నారు. రెవెన్యూ, మార్కెట్ యార్డు అధికారులు ఎవరూ పట్టించుకోవడం లేదు. దీంతో గ్రామాల్లో వారి హవా నడుస్తోంది. అనేక కారణాలను చూపుతూ వారు అతి తక్కువ ధరను రైతుకు చెల్లిస్తున్నారు. మద్దతు ధర రూ.7 వేల వరకు ఉండగా రైతులకు కేవలం రూ. 5,500నుంచి ఆరువేల వరకు మాత్రమే చెల్లిస్తున్నారు.

రైతులకు మార్కెట్ సౌకర్యం లేదు..



గడల సత్యనారాయణ

రైతులకు మార్కెట్ సౌకర్యం లేదు. అనివార్య పరిస్థితులు, వ్యాపారులను ఆశ్రయించక తప్పడం లేదు. పత్తి కొనుగోలు కేంద్రాల ఏర్పాటు చేయాలి. అప్పుడే రైతులకు గిట్టుబాటు ధర లభిస్తుంది.

వ్యాపారులది అంతా మోసం



సోడె బిక్షం

గ్రామాల్లోకి వచ్చి పత్తి కొనుగోలు చేసే వారు అంతా మోసాలు చేస్తున్నారు. అసలే పంట దిగుబడి ఆశించినంత లేదు.. ఉన్న పంటకు గిట్టుబాటు ధరలేదు.. తూకంలో దారుణమైన మోసాలు జరిగినా పట్టించుకునే వారే లేరు. ప్రభుత్వం పత్తిరైతులను బాధలు పట్టించుకోవాలి.

ముగిసిన సైన్స్ ఫెయిర్

- బహుమతి ప్రదానోత్సంలో పాల్గొన్న ఎమ్మెల్యేలు జారే, కోరం, కలెక్టర్, ఎస్పీ



అధికారులతో కలిసి విజేతలకు బహుమతులను అందజేస్తున్న ఎమ్మెల్యే జారే

అన్నపురెడ్డిపల్లి, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): అన్నపురెడ్డిపల్లిలో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జిల్లా స్థాయి వైజ్ఞానిక ప్రదర్శన విజయవంతగా ముగిసింది. ఊహించిన దానికంటే అధికంగా జిల్లా వ్యాప్తంగా విద్యార్థులు తమ ప్రాజెక్టులతో హాజరై ప్రదర్శించారు. 900లకు పైగా ఎగ్జిబిట్స్ వచ్చినట్లు నిర్వాహకులు తెలిపారు. అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ మూడు రోజుల పాటు అన్నపురెడ్డిపల్లిలోనే మకాం వేసి ఏర్పాట్లను స్వయంగా పర్యేక్షించారు. కాగా ప్రాజెక్టులతో వచ్చిన విద్యార్థులకు తోడుగా వందలాది మంది తరలి రావటంతో ప్రాంగణంతో పాటు అన్నపురెడ్డిపల్లి జనసందోహంతో కళకళలాడింది.

భవిషత్ అంతా సైన్స్‌దే...

బహుమతుల ప్రదానోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యేలు ఆదినారాయణ, కనకయ్యతో పాటు కలెక్టర్ జితేష్ వి. పాటిల్, ఎస్పీ రోహిత్‌రాజు మాట్లాడుతూ ప్రతీ రంగం అభివృద్ధి చెందాలంటే సైన్సే మూలాధారం అన్నారు. టెక్నాలజీ ఆధారంగా ప్రతి రంగం ఎంతో వేగంగా అభివృద్ధి చెందుతుందని, శాస్త్ర సాంకేతిక రంగాల్లో అపారమైన అవకాశాలు ఉంటాయన్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకొని విద్యార్థులు భవిషత్ ప్రణాళికలు నిర్దేశించుకోవాలని, అదే సమయంలో ఉపాధ్యాయులు సైతం విద్యార్థులను ప్రయోగాలపై ఆశక్తి పెంచేందుకు కృషి చేయాలన్నారు. సైన్స్ ఫెయిర్ కార్యక్రమాలు ఎక్కువగా నిర్వహిస్తే విద్యార్థులో మరింత అవగాహన పెరుగుతుందని, దీన్ని దృష్టిలో ఉంచుకొని విద్యాశాఖ అధికారులు కృషి చేయాలని కోరారు.

రాష్ట్రస్థాయికి 28 ప్రాజెక్టులు ఎంపిక...

వైజ్ఞానిక ప్రదర్శనలో 800లకు పైగా ప్రాజెక్టులు ప్రదర్శించగా నాలుగు విభాగాల నుంచి 28 ప్రాజెక్టులు రాష్ట్ర స్థాయికి ఎంపిక అయ్యాయి. సీనియర్ విభాగం నుంచి 7, జూనియర్ 7, గిరిజన పాఠశాల నుంచి 7 ఎంపిక కాగా, ఇన్స్పైర్ మనక్ నుంచి 6, టీచర్ విభాగం నుంచి ఒకరిని న్యాయనిర్ణేతలు ఎంపిక చేశారు. వీటిల్లో ముఖ్యంగా ఆహారం, ఆరోగ్యం, పరిశుభ్రత. రవాణ, కమ్యూనికేషన్. సహజ వ్యవసాయం. విపత్తుల నిర్వాహణ. వ్యర్థాల - నిర్యాహణ. వనరులు- నిర్వాహణపై రూపొందించిన నమూన ప్రాజెక్టులను ఉత్తమమైయినగా గుర్తించారు. వీటిని రూపొందించిన విద్యార్థులకు ఎమ్మెల్యేలు, కలెక్టర్, ఎస్పీ, డీఈవో మిగతా ఉన్నతాధికారులు బహుమలు అందజేశారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు అధికారులతో కలిసి స్థానిక కాంగ్రెస్ నాయకులు పర్సా వెంకటేశ్వరావు, వేములు రమణ, వనమా గాంధీ కృషి చేశారు.

ముందస్తు ట్యాక్స్‌తో ముప్పు

- 5శాతం తగ్గింపునకు పోతే నూరుశాతం పెండింగ్
- ఎర్లీ బర్డ్‌కు ప్రోత్సహించాల్సిన అధికారుల నిర్లక్ష్యం

ఖమ్మం సంక్షేమ విభాగం, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): ముందస్తుగా పన్నులు చెల్లించే వారిని ఖమ్మం నగర పాలక సంస్థ అధికారులు ముప్పు తిప్పలు పెడుతున్నారు. ఒకటి రెండు రోజులు కాదు ఏకంగా 9నెలల పాటు తిప్పుకొంటునే ఉన్నారు. దీంతో ఎర్లీబర్డ్ స్కీంపై విమర్శలు వెలువడుతున్నాయి. నగరంలో వందకు పైగా ప్రైవేటు ఆస్పత్రులు ఉన్నాయి. వాటిలో 40శాతం హాస్పిటల్స్ ఖమ్మం నగర పాలక సంస్థకు ట్యాక్స్‌లు ఎగ్గొట్టే ప్రయత్నం చేస్తుంటాయి. కానీ వైరా రోడ్డులోని రోహిత్ టెస్ట్‌ట్యూబ్ సెంటర్ నిర్వాహకులు మాత్రం యేటా ముందుస్తు చెల్లింపులు(ఎర్లీ బర్డ్ స్కీం) చేస్తారు. ఈ క్రమంలో 2023లోను ఆస్పత్రికి సంబంధించి రూ. 72,320 ట్యాక్స్‌చెల్లించి రసీదు పొందారు. తిరిగి 2024లో మళ్లీ ముందస్తు ట్యాక్స్ చెల్లింపులకు వెళ్లగా గతేడాది బకాయిలు కనిపించాయి. ఎర్లీబర్డ్ స్కీంలో ట్యాక్స్ డబ్బులు తీసుకున్న అధికారులు ఆన్‌లైన్‌లో నమోదు చేయకుండా వదిలేశారను. 5శాతం ట్యాక్స్ తగ్గింపు వస్తుందని ముందస్తు చెల్లింపులు చేసినందుకు నూరుశాతం ట్యాక్స్ డబ్బులు పెండింగ్‌లో పడ్డాయి. దీంతో తొమ్మిది నెలలుగా ఆస్పత్రి నిర్వాహకులు ఖమ్మం నగర పాలక సంస్థ కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలకు చేస్తున్నారు.

● ఖమ్మం నగరానికి చెందిన రిటైర్డ్ ఉద్యోగి గడే వెంకటేశ్వరరావు కేఎంసీ ఎదుట గట్టయ్య సెంటర్‌లో తన ఇంటి ట్యాక్స్‌లో కనీసం 5శాతం ట్యాక్స్ తగ్గిన కుటుంబ అవసరాలకు ఆర్థికంగా తోడ్పటు జరుగుతుందని వచ్చిన పెన్షన్ డబ్బుల్లో ముందస్తుగా 2023 ఎర్లీబర్డ్ స్కీంలో రూ.5,440 చెల్లించారు. కానీ ఎర్లీబర్డ్ స్కీం అమలు కాక పోగా 2023 ట్యాక్స్ బకాయిలతో పాటుగా వడ్డీ కలిపి 2024 ట్యాక్స్ చెల్లించాలని కేఎంసీ అధికారులు నోటీసులు జారీ చేశారు.

పరిష్కారం చూపటంలో నిర్లక్ష్యం

ఎర్లీబర్డ్ స్కీంలో జరిగిన ఆన్‌లైన్ తప్పిదాలకు ఖమ్మం నగర పాలక సంస్థ అధికారులే బాధ్యత వహించి సీడీఎంఏ స్థాయిలో సమీక్షించి డబ్బులు జమ చేయించాల్సి ఉంటుంది. కానీ కేఎంసీలో అటువంటి బాధ్యతలు ఎవరూ తీసుకోవటం లేదు. రోజు కేఎంసీ చుట్టూ తిరుగుతున్నా పట్టించుకోవడం లేదు.

సాంకేతిక కారణాలతోనే...

ఖమ్మం నగర పాలక సంస్థ పరిధిలో ఎర్లీ బర్డ్ స్కీంలో ట్యాక్స్ చెల్లించిన వారికి సాంకేతిక కారణాలతో తిరిగి బకాయిలు చూపిస్తున్నాయి. దీనికి సీడీఎంఏ స్థాయిలో పరిష్కారం జరగాల్సి ఉంటుంది. ఇలా సమస్య ఉన్న వారు ఎక్కువ మంది లేరు. కొద్ది మందికే ఇలా జరిగింది. కమిషనర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం చేపిస్తాం.

జి. శ్రీనివాసరావు, ఆర్వో

వస్తువులను తయారు చేసి

జీవనోపాధి పొందాలి

- ఐటీడీఏ పీవో రాహుల్



దుకాణాన్ని ప్రాంభిస్తున్న దృశ్యం

భద్రాచలం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): భద్రాచలంలోని రామాలయాన్ని సందర్శించే భక్తులను ఆకర్షించేలా వస్తువులను తయారు చేసి మహిళలు జీవనోపాధి పొందాలని భద్రాచలం ఐటీడీఏ పీవో బి.రాహుల్ అన్నారు. బుధవారం భద్రాచలంలోని శ్రీ సీతా రామచంద్రస్వామి వారి ఆలయ ప్రాంగణంలో దమ్మక్క లయాబిలిటీ గ్రూప్ గిరిజన మహిళలు వివిధ రకాల వస్తువులతో ఏర్పాటు చేసిన దుకాణాన్ని రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ చైర్మన్ పొదెం వీరయ్యతో కలిసి పీవో ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భక్తులను ఆకర్షించేలా మహిళలు వస్తువులను సరసమైన ధరలకు అమ్మకాలు జరపాలని అన్నారు. ఈ దుకాణంను వృద్ధిలోకి తెచ్చేందుకు మార్కెటింగ్ సౌకర్యాలను మెరుగుపర్చుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం ఈవో ఎల్.రమాదేవి, జీసీసీ డీఎం సమ్మయ్య, జేడీఎం హరికృష్ణ, పరిమి శ్రీనివాస్, ముర్ల రమేష్‌రెడ్డి, విజయలక్ష్మి, రాజ్ సులోచన, జేబీ రాణి, రాజకుమారి, రమాదేవి, భారతి, మంగ, కృష్ణవేణి, సురేష్ పాల్గొన్నారు.

24న శైవ క్షేత్రాలకు

ప్రత్యేక బస్సులు



ఖమ్మం ఖానాపురంహవేలి, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం చివరి సోమవారం ఈనెల 24వ తేదీన శైవక్షేత్రాలకు ఆర్టీసీ ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేసిందని ఖమ్మం డిపో మేనేజర్ దినేష్‌కుమార్ తెలిపారు. పంచ రామాలైన అమరావతి, భీమవరం, పాలకొల్లు, ద్రాక్షారమాం, సామర్లకోట దర్శన నిమిత్తం ఈ నెల 24 ఆదివారం ప్రత్యేక సూపర్ లగ్జరీ, డీలక్స్ బస్సులను ఏర్పాటు చేశామని తెలిపారు. అన్నవరం సత్యనారాయణ స్వామి వ్రతం, దర్శనం కోసం ప్రత్యేక బస్సులు నడుపుతామన్నారు. 24వ తేదీ రాత్రి 7 గంటలకు, 8 గంటలకు ప్రత్యేక బస్సులు బయలుదేరుతాయని తెలిపారు.

మెనూ ప్రకారం భోజనం అందించాలి

- ఫుడ్ కమిషన్ సభ్యులు ఓరుగంటి ఆనంద్, జ్యోతి

కొణిజర్ల, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనాన్ని అందించాలని తెలంగాణ ఫుడ్ కమిషన్ సభ్యులు ఓరుగంటి ఆనంద్, జ్యోతి లు సూచించారు. బుధవారం కొణిజర్లలోని పీహెచ్‌సీని, బస్వాపురం సమీపంలోని బాలికల ఆశ్రమ పాఠశాలను, తనికెళ్ల సమీపంలోని మహాత్మగాంధీ జ్యోతిరావు పూలే బాలుర వసతి గృహాన్ని సందర్శించి, ఆహార భద్రతపై తనిఖీ చేశారు. ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనాన్ని అందిస్తున్నారా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలోని టాయిలెట్స్, కిచెన్, స్టోర్‌రూమ్, తరగతి గదులను పరిశీలించారు. మెనూ పట్టికను పరిశీలించి మెనూ పట్టిక పిల్లలకు కనపడే విధంగా ఉంచాలని సూచించారు. కోడుగుడ్లు మూడు పూటల పెడుతున్నారా అని విద్యార్థులను అడిగి ఆరా తీశారు. ఆహార భద్రత చట్టంపై విస్తృత ప్రచారం చేయాలని అధికారులకు తెలిపారు. అనంతరం కొణిజర్ల పీహెచ్‌సీని సందర్శించి రోగులకు ఎటువంటి వైద్యం అందదిస్తున్నారని వైద్యులను అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రిలో వసతులను పరిశీలించారు. గర్భిణీలకు అందించే సేవలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి, జిల్లా పౌరసరఫరాలశాఖ అధికారి చందన్‌కుమార్, పౌరసరఫరాల జిల్లా మేనేజర్ గంటా శ్రీలత, జిల్లా విద్యాశాఖాధికారి సోమశేఖరశర్మ, జిల్లా సంక్షేమశాఖ అధికారి రాంగోపాల్‌రెడ్డి, మండల విద్యాశాఖాధికారి అబ్రహం, మండలాధికారులు తదితరులు పాల్గొన్నారు.

పత్తి కొనుగోళ్ల తూకంలో మోసం

నలుగురు వ్యక్తులను చితకబాదిన రైతులు

చర్ల, నవంబర్ 20 (ఆంధ్రజ్యోతి): పత్తి కొనుగోళ్ల తూకంలో మోసాలకు పాల్పడుతున్న నలుగురు వ్యక్తులకు రైతులు దేహశుద్ధి చేశారు. ఈ ఘటన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల మండలం సింగసముద్రం గ్రామంలో బుధవారం చోటు చేసుకుంది. జూలూరు పాడు మండలానికి చెందిన నలుగురు వ్యక్తులు చర్ల మండంలోని గ్రామాల్లో తిరుగుతూ పత్తి కొనుగోలు చేస్తున్నారు. ఇదే క్రమంలో సింగసమ్రుదం గ్రామంలో క్వింటాలు రూ.6600కు కొనుగోలు చేశారు. అనంతరం కాటాలు వేసి పత్తిని బండిలోకి ఎక్కించారు. ఇతర వ్యాపారుల కన్నా రేటు ఎక్కువ ఇస్తుండడం, మాటల్లో తడబాటు ఉండంతో రైతులతోపాటు స్థానిక వ్యాపారులకు అనుమానం వచ్చింది. దీంతో వాళ్ళ పత్తిని దింపి బయట నుంచి తెచ్చిన కాటాల్లో పత్తిని తూకం వేశారు. ప్రతీ క్వింటాకు సుమారు 30 కే జీల పత్తి తేడా వచ్చింది. దీంతో ఆగ్రహించిన రైతులు, స్థానిక వ్యాపారులు వారిని చితకబాదారు. తప్పు అయ్యిందంటూ వ్యాపారులు చెప్పుకునే ప్రయత్నం చేశారు. రైతులు పోలీస్ స్టేషన్‌లో పిర్యాదు చెయ్యాలని చూసే సరికి అక్కడి నుంచి ఉడాయించారు. కాగా గత కొన్ని రోజులుగా చర్ల మండలంలో ఈ వ్యాపారులు రైతుల నుంచి పత్తిని కొన్యూగోలు చేశారు. చాలా మంది రైతులు మోసపోయి ఉంటారని రైతులు వాపోతున్నారు. గత ఏడాది కుర్నపల్లి గ్రామంలో కూడా ఇలానే తూకంలో మోసం చేస్తు వ్యాపారులు పట్టుబడ్డారు.

దళారీ వ్యవస్థను అరికట్టండి..

- ఐటీడీఏ పీవోకు గిరిజన సంఘాల వినతి

భద్రాచలం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : ఐటీడీఏ పరిధిలోని ఏజెన్సీ మండలాల్లో పత్తి కొనుగోళ్లలో గిరిజనేతరుల దళారీ వ్యవస్థకు చెక్‌పెట్టాలని ప్రాజెక్టు ఆఫీసర్ బి.రాహుల్‌ను ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు గుగులోతు రాజేష్‌నాయక్, గోండ్వాన సంక్షేమపరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు పాయం సత్యనారాయణ, మానవ హక్కుల సంఘం జిల్లా కార్యదర్శి కిష్ట శ్రీనివాసరావు వాల్మీకి, సాయినాయక్ కోరారు. భద్రాచలంలో బుధవారం ఐటీడీఏ కార్యాలయంలో పీవోను కలిసి వినతి పత్రం అందజేశారు. ముఖ్యంగా జూలూరుపాడు మండలంలో గిరిజనేతరులు సిండికేట్‌గా ఏర్పాటై ఎలాంటి అర్హత ప్రమాణాలు లేనప్పటికీ ఏజెన్సీ చట్టాలకు వ్యతిరేకంగా తక్కువ ధరలకు పత్తిని కొనుగోలు చేస్తున్నారని ఆరోపించారు. వే బ్రిడ్జి కాటా యజమానితో ఒప్పందం కుదుర్చుకొని అధిక బరువును తక్కువ చూపి పత్తిని కొనుగోలు చేస్తున్నారని ఆరోపించారు. దళారీ వ్యవస్థపై 1/70 చట్టం ప్రకారం శాఖపరమైన చర్యలు తీసుకోవాలని, జిల్లాలో గిరిజనేతరులు లైసెన్సులు పొంది ఉంటే ఏజెన్సీ ప్రాంతంలో అది వర్తించదని అన్నారు. ఆ లైసెన్సును వెంటనే రద్దు చేయాలని కోరారు. సీసీఐ కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేసి రైతు నుంచి క్వింటా పత్తి ధర రూ.13 వేలకు కొనుగోలు చేయాలని కోరారు.

పత్తి కొనుగోళ్లలో నిబంధనలు చిత్తు

(5వ పేజీ తరువాయి)

పండుతుండడంతో నాణ్యత కలిగి ఉంది. దీంతో ఇతరరాష్ట్రాలకు చెందిన వ్యాపారులు కూడా జిల్లా పత్తిని కొనుగోలు చేసేందుకు ఉత్సాహం చూపుతున్నారు. పత్తి కొనుగోళ్లకు ఖమ్మం మార్కెట్‌తో పాటు ఉమ్మడి జిల్లాలో పలుచోట్ల వ్యవసాయ మార్కెట్లు ఉండగా, మండల కేంద్రాల్లో కూడా ప్రైవేటుగా పత్తి కొనుగోళ్లు ముమ్మరంగా సాగుతున్నాయి. వాస్తవానికి కమీషన్ వ్యాపారిగా లైసెన్సు తీసుకున్న వారు రైతులనుంచి పత్తిని వ్యాపారులు కొనుగోలు చేయించినందుకు మధ్యవర్తిగా 100 రూపాయలకు రూ.2 చొప్పున కమిషన్ తీసుకోవాల్సి ఉంటుంది. ఇది మార్కెట్‌శఖ నిబంధన. ఒక క్వింటా పత్తి రూ.6 వేలకు అమ్మితే రైతుకు సహకరించిన కమీషన్ వ్యాపారి రూ.120 కమీషన్ తీసుకోవాల్సి ఉంటుంది. అయితే కమీషన్ వ్యాపారులు రైతులనుంచి రూ.4కు పైగా వసూలు చేస్తున్నారు. కొంతమంది రైతులకు పెట్టుబడి పెట్టిన చోట కమీషన్ రూ.5కూడా తీసుకుంటున్నారు. ఇదంతా అనధికారికంగా సాగుతున్న దందా. మార్కెటింగ్ శాఖ వద్ద కొనుగోలుదారులు కింద ట్రేడింగ్ లైసెన్సులు, మరికొందరు కమీషన్‌దారులుగా లైసెన్సులు తీసుకుని పత్తి కొనుగోళ్లలో పాల్గొనాల్సి ఉంటుంది. ట్రేడింగ్ లైసెన్సు కలిగిన వ్యాపారులు రైతులవద్ద కమీషన్ తీసుకోకూడదు. కమీషన్ వ్యాపారులు మాత్రమే రైతులకు, కొనుగోలుదారులకు మధ్య కమీషన్ ఏజెంట్లుకు మార్కెటింగ్ శాఖ నిబంధనల ప్రకారం కమీషన్ తీసుకోవాల్సి ఉంది.

లైసెన్సులు లేకపోయినా వేరే వారి లైసెన్సు పేర్లతో కొందరు ఉండగా, కమీషన్ వ్యాపారి లైసెన్సు లేకుండా పత్తి కొనుగోలు చేయించి కమీషన్ కూడా అధికంగా గుంజుతున్న ఏజెంట్లుకూడా అధికంగానే ఉన్నారు. ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో 600 పైగా కమీషన్ ఏజెంట్లు ఉండగా ట్రేడింగ్ లైసెన్సు కలిగిన వారు 40 మంది వరకు ఉన్నారు. అయితే మండల కేంద్రాల్లో కమిషన్ ఏజెంట్లకు లైసెన్సులు లేకపోయినా రైతుల నుంచి కమీషన్లు వసూలు చేస్తున్నారు.

దీంతో రైతుల ఆదాయానికి గండి పడుతుంది. ఇటీవల మార్కెటింగ్ శాఖ అధికారులు కమీషన్ ఏజెంట్లు లైసెన్సు లేకుండా రైతుల నుంచి కమీషన్ తీసుకుంటే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రైతులు కూడా తమనుంచి రూ.2 కమీషన్‌కు రూ.4పైగా వసూలు చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

దీంతో కమీషన్ ఏజెంట్లకు, రైతులకు రగడ నడుస్తున్నది. ఏన్కూరు మార్కెటింగ్ పరిధిలో మార్కెటింగ్‌శాఖ అధికారులు లైసెన్సులులేని ఏజెంట్లు కమీషన్ తీసుకోవద్దన్న ఆంక్షలతో పత్తి కొనుగోళ్లు నిలిపివేయడం కూడా వివాదానికి దారితీసింది.

గన్నీ సంచుల కొరతపై గలాట

- ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతుల అవస్థలు
- సరిపడా సరఫరా చేయని అధికారులు
- పుల్లయ్య బంజరలో గన్నీ సంచుల కోసం ఘర్షణ



పుల్లయ్య బంజర కొనుగోలు కేంద్రంలో చినిగిన సంచులు

కల్లూరు, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోళ్ల వేళ గన్నీ సంచుల కొరత రైతుల మధ్య ఘర్షణకు దారి తీసింది. చివరకు పోలీసులు జోక్యం చేసుకోవడంతో అరకొరగా సంచులు అందించారు. ఈ ఘటన కల్లూరు మండలంలోని పుల్లయ్య బంజర (ఐకెపి) మల్లిక గ్రామ సమాఖ్య ధాన్యం కొనుగోలు కేంద్రంలో బుధవారం చోటుచేసుకుంది. వాస్తవంగా ధాన్యం కొనుగోళ్లలో ఖమ్మం జిల్లా స్థాయిలోనే పుల్లయ్య బంజర మల్లిక గ్రామ సమాఖ్య కొనుగోలు కేంద్రం అగ్రగామిగా నిలిచింది. కల్లూరు, కిష్టయ్యబంజర, పుల్లయ్యబంజర, లోకవరం గ్రామాలకు చెందిన రైతులు తమ ధాన్యాన్ని అమ్మేందుకు ఈ కేంద్రానికి తరలించారు. ఎఫ్‌సిఐ నిబంధనల ప్రకారం 17 శాతం తేమ ఉండేటట్లుగా రైతులు ఈ కేంద్రం పరిధిలో గల శివాలయం ప్రాంగణంలో వేల టన్నుల ధాన్యాన్ని రాశులుగా ఆరబోశారు.

ఈ కేంద్రంలో ఇప్పటి వరకు సుమారు 12 వేల క్వింటాళ్ల ధాన్యాన్ని కొనుగోలు చేశారు. ఇంకా 20 వేల నుంచి 25 వేల క్వింటాళ్ల వరకు కాంటా వేసేందుకు సిద్ధంగా ఉన్నాయి. రెండు రోజుల్లో మరో 20 వేల క్వింటాళ్ల కొనుగోలుకు సిద్దమవుతాయి. ఇంత పెద్ద ఎత్తున రైతులు ధాన్యం అమ్మేందుకు సిద్ధంగా ఉండగా అరకొరగా గన్నీ సంచులు అందాయి. వాటిలో 10 వేల పాత గన్నీ సంచులు కాగా, 3 వేల నుంచి 4 వేల వరకు చినిగిన గన్నీ సంచులున్నాయి.

జిల్లా అధికారులు ఈ కేంద్రానికి అరకొరగా గన్నీ సంచులు సరఫరా చేయటంతో రైతుల మధ్య ఘర్షణ వాతరవరణం నెలకొన్నది. ఈ సమాచారం తెలుసుకున్న పోలీసులు కేంద్రం వద్దకు చేరుకొని గన్నీ సంచుల పంపిణీ సక్రమంగా జరిగేటట్టు చర్యలు తీసుకున్నారు. అయితే రైతులకు అవి అరకొరగానే అందాయి. వాస్తవంగా సగటున ఒక్కో రైతుకు 500 గన్నీ సంచులు అవసరం కాగా, 100 గన్నీ సంచులే ఇవ్వటంతో రైతులు తీవ్ర నిరాశకు లోనయ్యారు. ఈ కేంద్రంలో ఆరబోసిన ధాన్యం ప్రకారం చూస్తే, 1.50 లక్షలకు పైగా గన్నీ సంచులు అవసరం అవుతాయని చెబుతున్నారు. ప్రభుత్వం తరఫున ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో డిమాండ్‌కు తగినట్లుగా గన్నీ సంచులను సరఫరా చేయటంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని రైతులు విమర్శిస్తున్నారు. పాత సంచుల్లో ధాన్యం నింపితే మిల్లర్లు దిగుమతికి నిరాకరిస్తున్నట్లు రైతులు వాపోతున్నారు. వాతావరణ పరిస్థితుల్లో ఆకస్మికంగా మార్పులు వస్తున్నాయని, అకాల వర్షాలు కురిస్తే ధాన్యం రాశులు తడిసిపోతాయని వారు ఆందోళన చెందుతున్నారు.

వంట మనుషులకు అపూర్వ గౌరవం

అన్నపురెడ్డిపల్లి, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): తన హోదాని పక్కన పెట్టి శ్రామికుల కష్టాన్ని తెలిసిన వ్యక్తిగా ఆశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ వంట మనుషలను అపూర్వంగా గౌరవించారు. అన్నపురెడ్డిపల్లిలో సైన్స్ ఫెయిర్ ముగింపు కార్యక్రమంలో వేలాదిగా తరలి వచ్చిన విద్యార్థులు, ఉపాధ్యాయులకు వంటలు చేసిన మహిళలకు ఎమ్మెల్యే కాళ్లు కడిగి తన కృతజ్ఞతను చాటుకున్నారు. అదే సమయంలో వారందరికి దుస్తులు సైతం అందజేశారు.



తోగ్గూడెం క్వారీల చుట్టూ ట్రెంచ్ ఏర్పాటు

పాల్వంచ, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): పాల్వంచ మండలం తోగ్గూడెం గ్రామంలోని కంకర క్వారీల చుట్టూ అధికారులు మంగళవారం ట్రెంచ్ ఏర్పాటు చేసారు. మైనింగ్ ఏడీ దినేష్, పాల్వంచ తహశీల్దార్ వివేక్‌లు తోగ్గూడెంలోని ఆరు క్వారీలను ముందుగా పరిశీలించారు. ఆ ప్రాంతాల్లో తవ్వకాల్లో వచ్చిన కంకరను క్వారీల నిర్వహకులు బయటకు లారీల్లో తరలించకుండా ఉండేందుకు క్వారీల చుట్టూ ట్రెంచ్‌లను ఏర్పాటు చేసారు. కానీ ఈ విషయం ఆలస్యంగా బుధవారం వెలుగులోకి వచ్చింది. ట్రెంచ్ ఏర్పాటు చేసిన విషయాన్ని ఎవ్వరికీ తెలియకుండా ఎందుకు దాచారు, ఏ కారణంతో ట్రెంచ్ ఏర్పాటు చేసారు అనే విషయాలను బహిర్గతం చేయకపోవడం విశేషం. ఈ విషయాలపై ఏడీ మైన్స్ దినేష్‌ను వివరణ కోరగా పత్రికల్లో వచ్చిన వార్తలు, స్థానికుల ఫిర్యాదుతో ట్రెంచ్ ఏర్పాటు చేసామని చెప్పారు.

రాములోరి క్యాలెండర్, డైరీ సిద్ధం

ఆవిష్కరించిన దేవస్థానం ఈవో రమాదేవి



క్యాలెండర్, డైరీని ఆవిష్కరిస్తున్న ఈవో రమాదేవి

భద్రాచలం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): భద్రాచలంలోని సీతారామచంద్రస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో రూపొందించిన 2025 క్యాలెండర్, డైరీలు ఆకర్షణీయంగా ఉన్నాయి. వీటిని బుధవారం భద్రాచలంలోని రామాలయంలో దేవస్థానం ఈవో ఎల్.రమాదేవి, వైదిక పరిపాలన అధికారులు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రధాన అర్చకులు అమరవాది విజయరాఘవన్, ఉప ప్రధాన అర్చకులు అమరవాది మురళీకృష్ణమాచార్యులు, రామాయణ పారాయణదారులు ఎస్టీజీ అంతర్వేది కృష్ణమాచార్యులు, ఏఈవో వి.శ్రవణ్‌కుమార్, ఇంజనీరింగు ఈఈ వి.రవీంద్రనాథ్, శ్రీనివాసరెడ్డి ఉన్నారు. ఇదిలా ఉండగా దేవస్థానం ప్రచురించిన క్యాలెండర్ ధర రూ.120 కాగా, ఈసారి భక్తులు తమ మిత్రులు, ఇతర ప్రముఖులకు నూతన సంవత్సర కానుకగా ఇచ్చేందుకు దేవస్థానం పేరుతో ఉన్న ప్రత్యేక బాక్సును రూపొందించారు. కాగా దేవస్థానం ప్రచురించిన డైరీకి రూ.75 ధరగా నిర్ణయించారు. ఇప్పటికే ఇవి భక్తులకు విక్రయం కోసం అందుబాటులో ఉంచారు.

క్యాలెండర్లో స్వామి వారి సేవలు

క్యాలెండర్లో స్వామి వారికి నిర్వహించే విశేష సేవలకు సంబంధించిన ఫోటోలను నెలల వారీగా ప్రచురించారు. జనవరిలో సీతారామలక్ష్మణుల మూలమూర్తుల ఫోటో పెట్టగా, ఫిబ్రవరిలో నిత్యం నిర్వహించే దర్బారు సేవ, మార్చిలో ప్రతి శుక్రవారం నిర్వహించే స్వర్ణకవచంలో మూలవరుల ఫోటోను ప్రచురించారు. ఏప్రిల్‌లో శ్రీరామనవమి నాడు సీతారాముల కల్యాణ దృశ్యం, మే నెలలో ప్రతి సోమవారం నిర్వహించే ముత్తంగి సేవలో భద్రాద్రి దాసాంజనేయస్వామి వారి చిత్రం పొందుపరిచారు. జూన్‌లో ప్రతి సోమవారం భద్రాద్రి రామయ్య మూలవరులకు అలంకరించే ముత్తంగి అలంకారంను, జూలైలో భద్రాద్రి రామునికి తొలి పూజలు సమర్పించిన దమ్మక్క చిత్రాన్ని ప్రచురించారు. ఆగస్టులో పవిత్రోత్సవాలు, సెప్టెంబరులో ముత్తంగి అలంకారంలో కనకలక్ష్మి తాయారు అమ్మవారు, అక్టోబర్లో శరన్నవరాత్రి మహోత్సవాల సందర్భంగా నిర్వహించే అష్టలక్ష్మి అలంకారాల ఫోటోలు ప్రచురించారు. నవంబర్‌లో విశ్వరూప సేవ, డిసెంబర్‌లో వైకుంఠ ఏకాదశి మహోత్సవాలను పురస్కరించుకొని నిర్వహించే దశావతార అలంకారాలు, ఉత్తర ద్వార దర్శనం చిత్రాలను ప్రచురించడం జరిగింది.

డైరీలో రామన్నాస్ గోల్డ్ వివరాలు

దేవస్థానం ఆధ్వర్యంలో రూపొందించిన డైరీలో భక్తరామదాసు, ఇతర ప్రముఖ భక్తులు, దాతలు అందజేసిన అజరామరమైన ఆభరణాలను ప్రచురించి వాటికి రామన్నాస్‌గోల్డ్ అని పేరు పెట్టారు. చింతాకు పతకం, మకర కంఠిహారం, రామ టెంకల హారం, అలాగే ఇతర హారాలను ప్రచురించారు.

అంబేద్కర్ అందరివాడు..

అలరించిన సంఘం శరణం గచ్ఛామి నాటకం


నాటకంలో ఓ సన్నివేశం

ఖమ్మం సాంస్కృతికం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం భక్త రామదాసు కళాక్షేత్రంలో బుధవారం ప్రదర్శించిన సంఘం శరణం గచ్ఛామి నాటకం అంబేద్కర్ అందరికీ పూజ్యనీయుడు అన్న సందేశాన్ని చాటింది. అంబేద్కర్‌ను కొన్ని సందర్భాలకు, కొన్ని వర్గాలకే పరిమితం చేయటం తగదు ఆయన త్యాగాలు అత్యంత స్మరణీయం అన్న నినాదాన్ని ప్రేక్షకుల్లోకి బలంగా తీసుకెళ్లారు.. అంబేద్కర్ జీవితం, ఆశయాలు, పోరాటాల ఇతివృత్తంగా నిర్మించిన నాటకం కావటంతో ఆద్యంతం ఆలోచింపచేసింది. విద్య అత్యంత ప్రభావ వంతమైన ఆయుధమని ఆ ఆయుధాన్ని కలిగిఉండటం ద్వారా సామాజిక వివక్షలను తిప్పి కొట్టవచ్చని సమసమాజాన్ని సాధించేందుకు చదువు చక్కగా ఉపయోగపడుతుందని చాటి చెప్పారు. అభ్యుదయ ఆర్ట్స్ అకాడమీ హైదరాబాద్ ఆధ్వర్యంలో 2016 సంవత్సరంలో నిర్మితమైన ఈనాటకం ఇప్పటికి 700కి పైగా ప్రదర్శనలివ్వటంతో నటీనటులు తమ పాత్రలను అవలీలగా పోషించారు. తెలుగు రాష్ట్రాల్లో అత్యంత ఆదరణ పొందిన నాటకంగా పేరు తెచ్చుకోవటంతో ఈ నాటకాన్ని చూసేందుకు ఇతర ప్రాంతాలకు చెందిన అంబేద్కర్ అభిమానులు నాటక రంగ ప్రియులు తరలివచ్చారు. రక్తకన్నీరు. మాభూమి తదితర నాటకాల తరువాత అత్యధిక ఆదరణ పొందిన నాటకంతోపాటు ఇది రెండు రాష్ట్రాల్లో అనేక ప్రదర్శనలిచ్చింది. సౌండ్ అండ్ లైటింగ్ టెక్నాలజీని ఉపయోగించటంతో నాటకంలోని ప్రతి సన్నివేశం రక్తి కట్టించింది. సన్నివేశాలకు తగిన వేషధారణ, అలంకరణలు ఆకట్టుకున్నాయి. నంది అవార్డు గ్రహీత కె. దేవేంద్ర రచించిన ఈనాటకానికి తూము శివ ప్రసాద్ దర్శకత్వం వహించారు.

పగలు రెక్కీ.. రాత్రిళ్లు చోరీ..

- వ్యవసాయ విద్యుత్ మోటార్ల మాయం- అన్నదాతల కలవరం
- మూడు నెలల్లో 42మోటార్ల చోరీ
- ఒక విద్యుత్ ట్రాన్స్‌ఫారం సైతం..
- ఆందోళనలకు గురవుతున్న రైతులు


కూసుమంచి మండలం హట్యతండ వద్ద చోరీకి గురయిన మోటార్లు

కూసుమంచి, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): పాలేరు నియోజకవర్గంలో నాగార్జునసాగర్ కాల్వల కింద, బోర్లు, బావుల ఆధారంగా మోటార్లు ఏర్పాటుచేసుకుని వరి, ఇతర పంటలు సాగుచేసుకుంటున్న రైతులు నిద్రలేని రాత్రులు గడుపుతున్నారు. ఒకప్పుడు కరెంటు ఎప్పుడు వస్తుందా అని ఎదురుచూస్తు మోటార్ల వద్ద కాపలా కాసేవారు. కానీ ఇప్పుడు మరోచిక్కువచ్చి పడింది. తాజాగా చిల్లర దొంగతనాలకు అలవాటుపడిన దొంగలముఠాలు రైతుల వ్యవసాయ మోటర్లను చోరీ చేస్తున్నారు. మోటార్లు లేనిపక్షంలో కరెంటువైర్లను చోరీ చేస్తున్నారు. మోటార్లను అమ్ముకోవడం లేదా, అందులో ఉన్న కాపర్‌వైరు బయటకు తీసి బహిరంగ మార్కెట్‌లో అమ్ముకుని సొమ్ము చేసుకుంటున్నారు. మొత్తం మీద 42 మోటార్లు చోరీ అయినప్పటికీ... తాజాగా ఇటీవల కూసుమంచి మండలం పాలేరు గ్రామంలో ఒకేరోజు ఏడు మోటార్లు చోరీకి గురయ్యాయి. ఆ వెంటనే గోపాలరావుపేట గ్రామంలో ఆరుగురు రైతుల మోటార్ల కేబుల్ వైర్లను కత్తిరించుకుని వెళ్లారు. దీంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వివరాలు పరిశీలిస్తే..

కూసుమంచి, నేలకొండపల్లి, ఖమ్మంరూరల్ మండలాల పరిధిలోని సాగర్ ఆయకట్టు పరిధిలోనూ, బోర్లు, బావులు ఆధారంగా రైతులు వరి, మిర్చి, పత్తి, మొక్కజొన్న పంటలు సాగుచేస్తుంటారు. ఈ క్రమంలో సాగునీరు అందని రైతులు కాల్వపై మోటార్లు బిగించుకుని పైపుల ద్వారా సాగునీరు పెట్టుకుంటారు. వందల సంఖ్యలో మోటార్లు అమర్చుకుని నీటిని తరలించి పంటలు సాగుచేసుకుంటున్నారు.

దురలవాట్లకు బానిసలుగా మారి చోరీలు

దురలవాట్లకు బానిసలుగా మారిన కొందరు దొంగలు ముఠాలుగా ఏర్పడి వ్యవసాయ మోటార్లను టార్గెట్ చేస్తున్నారు. పగలు పూట రెక్కీ నిర్వహించడం రాత్రిళ్లు చోరీలకు పాల్పడుతున్నారు. రెండు, మూడునెలల కాలంలో ఈప్రాంతాల్లో సుమారు 42కిపైగా మోటార్లు మాయం అయ్యాయంటే వీళ్ల చేతివాటం అర్థం చేసుకోవచ్చు. కూసుమంచి మండలం పాలేరులో 7, హట్యతండలో 6, కూసుమంచిలో 3, మల్లేపల్లిలో 2, హట్యతండ ఏటి బ్రిడ్జివద్ద 4, నాయకన్‌గూడెంలో 4, నేలకొండపల్లి మండలం ముఠాపురంలో 4, ఆచర్లగూడెంలో 6, ఆరెగూడెంలో 3, రామచంద్రాపురంలో 3 మోటార్లు చోరీకి గురయ్యాయి. బాధిత రైతులు ఇటీవల పోలీసులకు ఫిర్యాదు చేయగా విచారణ చేపట్టారు. దీంతో పాటు పాత ఇనుము దుకాణంలో విద్యుత్ వైరు గుర్తించిన సంబంధిత శాఖ అధికారులు పోలీసుల దృష్టికి తీసుకొచ్చారు. దీంతో తీగలాగగా డొంక కదిలింది. ఎవరు విక్రయించారో తెలుసుకుని వారిని తమదైన శైలిలో విచారించగా దొరికారు.

కూసుమంచి మండలం నాయకన్‌గూడెం గ్రామానికి చెందిన రాహుల్, జిల్లా సరిహద్దు సూర్యాపేట జిల్లా అన్నారుగూడెం గ్రామానికి చెందిన మండవసాయి, గోపతండకు చెందిన వాచ, రాయకుంటతండకు చెందిన శంకర్ తదితరులు ముఠాలుగా ఏర్పడి చోరీలకు పాల్పడుతున్నట్లు పోలీసులు గుర్తించారు. వీరిపై కేసులు నమోదు చేసి రిమాండ్‌కు పంపించారు. అయితే ఇప్పటివరకు కూసుమంచి, నేలకొండపల్లి మండలాల్లో 42మోటార్లు చోరీకి గురయినట్లు రైతులు చెపుతున్నారు. వీటివిలువ సుమారు రూ.12లక్షలు వరకు ఉంటుందంటున్నారు. వీటిలో కొన్ని మాత్రమే రికవరీ చేశారు.

అయితే చోరీ చేసిన మోటర్లకొన్నిటిని సుత్తెలతో పగులగొట్టి లోపల ఉన్న కాపర్‌వైరు తీసి విక్రయిస్తున్నారు. పైభాగం అల్యూమినియం కావడంతో వెంటనే పగిలిపోతుంది. లోపల ఉన్న కాపర్‌వైరుకు రూ.ఐదువేల నుంచి పదివేల వరకు అమ్ముకుని దొంగలు సొమ్ముచేసుకుంటున్నారు. దానిని నాయకన్‌గూడెం గ్రామానికి చెందిన నాగేశ్వరరావు అనేవ్యక్తికి విక్రయించినట్లుగా దొంగల విచారణలో తేలడంతో అతనిని కూడా రిమాండ్ చేశారు. రైతుల మోటార్లతో పాటు జాతీయ రహదారి నిర్మాణం కోసం కోక్యాతండ సమీపంలో ఏర్పాటుచేసిన డీఎన్నార్ ఇన్‌ఫ్రాకు చెందిన ఏడు మోటార్లు, హట్యతండ సమీపంలో కాల్వ వద్ద ఏర్పాటుచేసిన ట్రాన్స్‌ఫార్మర్ వైరును నిందితులు చోరీకి పాల్పడ్డారు.

పోలీసులపై రాజకీయనాయకుల ఒత్తిళ్లు

ఇటీవల నాయకన్‌గూడెం గ్రామానికి చెందిన దొంగల ముఠాను గుర్తించిన పోలీసులు వారిని తీసుకుని వచ్చి విచారిస్తుండగా, కొందరు బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీకి చెందిన నాయకులు దొంగలకు సపోర్టుగా పోలీసులపై ఒత్తిడి తీసుకవచ్చినట్లు ఆరోపణలు వచ్చాయి. దీంతో కొంత పోలీసులు నాయకుల ఒత్తిళ్లకు తలొగ్గి విచారణ చేసి పూర్తిస్థాయిలో రికవరీ చేయకుండానే రిమాండ్ చేసినట్లు ఆరోపణలున్నాయి.

నిఘా ఏర్పాటు చేస్తున్నాం: నాగరాజు ఎస్ఐ



ఇటీవల ఈప్రాంతంలో ఈతరహా దొంగతనాలకు పాల్పడుతున్న ముఠాలను గుర్తించి కేసులు నమోదుచేసి అరెస్టు చేసి రిమాండ్‌కు పంపించాం. దొంగతనాలు జరక్కుండా గ్రామాల్లో రాత్రిపూట గస్తీ తిరుగుతూ తగిన చర్యలు తీసుకుంటున్నాం. గ్రామాల్లో అనుమానితులు ఎవరైనా తిరుగుతే పోలీసులకు సమాచారం ఇవ్వాలి.

ఆహారభద్రత చట్టానికి భంగం వాటిల్లితే సహించేది లేదు

- ఫుడ్ కార్పొరేషన్ సభ్యులు ఆనంద్, జ్యోతి హెచ్చరిక


ఎంఎల్ఎస్ పాయింట్‌లో బియ్యం బస్తాలను పరిశీలిస్తున్న ఫుడ్ కార్పొరేషన్ సభ్యులు

వైరా, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఆహారభద్రత చట్టానికి భంగం కలిగితే సహించేది లేదని తమకున్న అధికారాల మేరకు సుమోటోగా చర్యలు తీసుకుంటామని రాష్ట్ర ఫుడ్ కార్పొరేషన్ సభ్యులు ఆనంద్, జ్యోతి హెచ్చరించారు. రెండురోజుల ఖమ్మంజిల్లా పర్యటనలో భాగంగా బుధవారం వైరా వ్యవసాయ మార్కెట్‌యార్డులోని పౌరసరఫరాలశాఖకు చెందిన ఎంఎల్ఎస్ పాయింట్ గోదాముల్లో రేషన్‌బియ్యాన్ని పరిశీలించారు. ప్రజల కోసమే ఫుడ్ కార్పొరేషన్ కమిషన్ ఉందని తెలిపారు. ఆహారభద్రత విషయంలో తమ హక్కులకు భంగం కలిగితే ప్రజలు ఫిర్యాదు చేయాలని వారు సూచించారు. హక్కులకు భంగం వాటిల్లితే ప్రజల తరఫున సుమోటోగా కేసులు నమోదు చేసే అవకాశం తమకు అధికారం ఉందని స్పష్టం చేశారు. ఆహారభద్రత చట్టం 2013 జిల్లాలో ఏవిధంగా అమలవుతుందనే దానిపై జిల్లాకు వచ్చామని తెలిపారు. పౌష్టికాహారాన్ని అందించటమే ఆహారభద్రత చట్టం ఉద్దేశ్యమని తెలిపారు. విద్యార్థులు దొడ్డుబియ్యంతో భోజనం చేయలేనందునే వారు ఆరోగ్యంగా ఉండేందుకు సన్నబియ్యాన్ని సరఫరా చేస్తున్నామని, ఎక్కడైనా దుర్వినియోగం జరిగితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఏన్కూరు, కొణిజర్ల, వైరాల్లో రేషన్‌షాపులు, అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ఎంఎల్ఎస్ పాయింట్లలో పర్యటించి ఆహారభద్రతకు సంబంధించిన విషయాలపై పరిశీలించామని తెలిపారు. గురువారం కూడా ఖమ్మంజిల్లాలోనే తమ కమిషన్ అందుబాటులో ఉంటుందని, ఏదైనా సమస్య ఉంటే తమకు ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. జిల్లా అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి, జిల్లా పౌర సరఫరాలశాఖ అధికారి చందన్‌కుమార్, జిల్లా మేనేజర్ గంటా శ్రీలత పాల్గొన్నారు.

లారీ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఎన్నికలకు బ్రేక్

చుంచుపల్లి, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): సింగరేణి సంస్థలోని టిప్పర్స్ అండ్ లారీ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్‌లో ప్రజాస్వామ్యబద్ధంగా జరగాల్సిన ఎన్నికను నిర్వహించకుండా అడ్డుకోవడం నియంత పాలనకు నిదర్శనంగా నిలుస్తుందని బరిలో ఉన్న అభ్యర్థులు బుధవారం మండిపడ్డారు. రెండు వర్గాలుగా ఉన్న వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు కొత్తగూడెం అసెంబ్లీ నియోజకవర్గ కన్వీనర్, టీపీసీసీ సభ్యులు జేబి శౌరీని కలిసి వారి సమస్యను వివరించారు. ఇరువర్గాల వారితో సంప్రదింపులతో సామరస్య పూర్వకంగా కొత్తగూడెం సీఈఆర్ క్లబ్‌లో ఎన్నికలకు జరిగేలా ఏర్పాట్లు చేసుకున్నారు. ఈ ఎన్నికల పర్యవేక్షకులుగా వెళ్ళిన న్యాయవాదులు మారపాక రమేష్, బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యెర్రా కామేష్‌లను, ఈ ఎన్నికల్లో బరిలో ఉన్న ఇద్దరిలో బూర్గుల అనిల్‌కుమార్, తానంగి రవికుమార్, సహాయకులు షైల చైతన్య, పెండ్యాల శ్రీనివాస్, దువ్వ సంపత్‌కుమార్, కాంటాత్మక ముఖేష్, సారా మహేందర్, కోలా నాగవర్మలను అరెస్ట్ చేసి చుంచుపల్లి పోలీస్ స్టేషన్‌కు తరలించి నిర్బంధించారు. అనంతరం విలేకరులకు వివరాలు వెల్లడించారు. ఈ ఎన్నికలు నిర్వహించడం ఏ విధంగా చట్ట వ్యతిరేక కార్యక్రమం అవుతుందో తెలపాలని ప్రశ్నించారు. పారదర్శకంగా జరగాల్సిన ఎన్నికను అడ్డుకోవడం సరికాదన్నారు. కొత్తగూడెం ప్రజలు గమనిస్తున్నారని, ప్రజాస్వామ్య వ్యవస్థకు నష్టం వాటిల్లేలా ఎలక్షన్‌లను జరగనీయకుండా అడ్డుకున్న వారికి ఖచ్చితంగా ప్రజాస్వామ్య బద్ధంగా బుద్ధి చెబుతామని హెచ్చరించారు.

రేపు చింతకానిలో హరీష్‌రావు పర్యటన


మాట్లాడుతున్న కమల్‌రాజ్

చింతకాని, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పొద్దుటూరు, లచ్చగూడెం గ్రామాల్లో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు, మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్‌రావు శుక్రవారం పర్యటించనున్నట్లు మాజీ జడ్పీ ఛైర్మన్ లింగాల కమల్‌రాజు తెలిపారు. పొద్దుటూరులో బుధవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన పాల్గొన్నారు. హరీష్‌రావు మండల పర్యటనలో భాగంగా పొద్దుటూరు గ్రామంలో ఇటీవల మృతిచెందిన రైతు బోజడ్ల ప్రభాకర్ కుటుంబాన్ని, అదే గ్రామంలో ఓ కేసులో అక్రమ అరెస్ట్ అయి ప్రస్తుతం బెయిల్‌పై ఉన్న బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పెంట్యాల పుల్లయ్య కుటుంబ సభ్యులను పరామర్శిస్తారన్నారు. అనంతరం లచ్చగూడెంలో విద్యుత్ షాక్‌తో మృతిచెందిన రైతు గూని ప్రసాద్ కుటుంబాన్ని పరామర్శించనున్నట్లు తెలిపారు. బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు పెంట్యాల పుల్లయ్య, గురిజాల హనుమంత రావు, వెంకటరామారావు, పాల్గొన్నారు.

ముద్దాయిలు మనుషులుగా
మారే విధంగా కారాగారాలు

- జైళ్ల శాఖ డీఐజీ యం.సంపత్

ఖమ్మంక్రైం, నవంబరు20(ఆంధ్రజ్యోతి): కారాగారాలు ఒకప్పటిలా కాకుండా నేరప్రవృత్తి కలిగిన ముద్దాయిలను సమాజానికి ఉపయోగకరమైన మనుషులుగా మార్చే ఆశ్రమాలుగా మారాయని జైళ్ల శాఖ వరంగల్ రేంజ్ డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ ప్రిజన్స్ (డీఐజీ) యం.సంపత్అన్నారు. నగరంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో ఖమ్మం జిల్లా జైలు పర్యవేక్షణాధికారి ఏ.శ్రీధర్ ఆధ్వర్యంలో బుధవారం వరంగల్ రేంజ్ జైళ్లశాఖ సిబ్బందికి రిట్రీట్ కార్యక్రమం నిర్వహించారు. ఈకార్యక్రమంలో వరంగల్ కేంద్ర కారాగార పర్యవేక్షణ అధికారి టి.కళాసాగర్,వరంగల్ జిల్లా సబ్ జిల్లా అధికారి విజయ్‌డేని, ఖమ్మం జిల్లా సబ్ జిల్లా అధికారి వెంకటేశ్వర్లు, ఖమ్మం జిల్లా జైలు పర్యవేక్షణాధికారి ఏ.శ్రీధర్, జైలర్లు ఏ.సక్రునాయక్, జి.లక్ష్మీనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

అనుమానాస్పదస్థితిలో వ్యక్తి మృతి

తిరుమలాయపాలెం, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని గోల్ తండా సమీపంలో భాగ్యలక్ష్మి కాటన్ మిల్లులో ఓ కార్మికుడు అనుమానాస్పద స్థితిలో మంగళవారం రాత్రి మృతి చెందాడు. మహారాష్ట్రకు చెందిన మాధవ్ సట్వాజి (24) అనే వ్యక్తి జిన్నింగ్‌మిల్లులో కార్మికుడిగా పనిచేస్తున్నాడు. నెలరోజుల క్రితం మిల్లులో పనికి చేరాడు. మంగళవారం రాత్రి మిల్లులోని ఉన్న పత్తిలో పడుకున్నాడు. ఆసమయంలో మరో వ్యక్తి డోజర్‌తో పత్తి తీసుకెళ్లి అతడిని గమనించకుండా పత్తిపోశాడు. దీంతో మాధవ్‌సట్వాజికి శ్వాస ఆడక మృతిచెందాడు. ప్రమాదవశాత్తు మృతిచెందాడా ఘర్షణ పడి మృతిచెందాడా అనే విషయం పోలీసుల విచారణలో తేలాల్సి ఉంది. సంఘటన స్థలాన్ని ఎస్ఐ జగదష్ పరిశీలించి, ఘటనపె కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐతెలిపారు.

ఎనిమిది ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

చింతకాని, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): చిన్నమండవ గ్రామ సమీపంలోని మున్నేటిలో అనుమతులు లేకుండా ఇసుకను రవాణా చేసేందుకు వెళ్లిన 8 ఇసుక ట్రాక్టర్లు, ట్రక్కులను ఎస్ఐ నాగుల్‌మీరా సిబ్బందితో కలసి పట్టుకున్నారు. పట్టుకున్న ఇసుక ట్రాక్టర్లపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

నేలకొండపల్లిలో సివిల్‌సప్లై అధికారుల తనిఖీలు

నేలకొండపల్లి, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ నుంచి వచ్చిన సివిల్‌సప్లై ఎన్‌ఫోర్స్‌మెంట్ టీం-1 అధికారుల బృందం బుధవారం మండలంలో పలు చోట్ల తనిఖీలు చేసింది. తనిఖీల వివరాలను తర్వాత విడుదల చేస్తామని ఎన్‌ఫోర్స్‌మెంట్ డీఎస్పీ వెంకటేష్ చెప్పారు. అన్ని పీపీసీలను క్రమం తప్పకుండా తనిఖీలు చేస్తామన్నారు. రేపు, ఎల్లుండి కూడా తనిఖీలు నిర్వహిస్తామన్నారు. సంబంధిత అధికారుల నుంచి కానీ, మిల్లర్ల నుంచి కానీ ఎట్టి పరిస్థితుల్లో రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా చూస్తామని ఆయన తెలిపారు. ఆయన వెంట ఇన్‌స్పెక్టర్ పండరిబను, ఎస్ఐ, సిబ్బంది ఉన్నారు.

చేపల వేటకు వెళ్లి వ్యక్తి గల్లంతు

చింతకాని, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): చేపల వేటకు వెళ్లి వ్యక్తి గల్లంతైన సంఘటన మండల పరిధిలోని తిమ్మినేనిపాలెం గ్రామంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన కొమ్ము మహేందర్ (55) గ్రామ సమీపంలోని మున్నేటిలో బుధవారం చేపల వేటకు వెళ్లాడు. సాయంత్రం అయినా ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు, గ్రామస్థులు మున్నేటి వద్దకు వెళ్లి వెతకగా ఆచూకీ లేకపోవడంతో పోలీసులకు సమాచారం అందించారు. ఎస్ఐ నాగుల్‌మీరా ఘటనా ప్రాంతానికి వెళ్లి ఫైర్ సిబ్బందితో పాటు గజ ఈతగాళ్లతో గాలించిన వ్యక్తి ఆచూకీ లభించలేదు. రాత్రి సమయం కావడంతో గాలింపు చర్యలు నిలిపివేసినట్లు ఎస్ఐ తెలిపారు.

వాహనాల తనిఖీ-జరిమానా విధింపు

తల్లాడ, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): పరిమితికి మించి ప్రజలను తరలిస్తున్న ఆటోలు, మినీ వ్యాన్లను బుధవారం తల్లాడ ఎస్ఐ బి.కొండల్‌రావు తనిఖీ చేశారు. గత రెండురోజులుగా తల్లాడ మండలంలోని నర్సింహారావుపేట, బిల్లుపాడు గ్రామాల మధ్య కూలీలు పనిచేస్తున్న మినీ వ్యాన్, ఆటోలు ప్రమాదాలకు గురై పలువురు కూలీలు గాయపడిన నేపథ్యంలో ఎస్ఐ సిబ్బందితో కలిసి వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా పరిమితికి మించి కూలీలను తరలిస్తున్న ఆటోలు, మినీ వ్యాన్లకు జరిమానా విధించారు.

రహదారి నిర్మాణంలో అవకతవకలు

- గ్రావెల్‌కు బదులు సుద్దమట్టి, రాళ్లతో రహదారి నిర్మాణం
- నాసిరకం మట్టి తోలకాలపై ఈఈకి రిపోర్టు చేస్తామంటున్న డీఈఈ


రాళ్లతో కూడిన మట్టిని రహదారిపై చదును చేస్తున్న దృశ్యం

అశ్వారావుపేట, నవంబరు20(ఆంధ్రజ్యోతి): అశ్వారావుపేట మండలం మద్దికొండ నుంచి నారంవారిగూడెం క్రాస్‌రోడ్డు వరకు నిర్మిస్తున్న ఆర్‌అండ్‌బీ రహదారి నిర్మాణంలో కాంట్రాక్టర్ ఇష్టానుసారంగా నిర్మిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. 1.7కిమీ. పొడవున్న ఈ రహదారికి రూ.1.76కోట్లతో నూతనంగా రహదారిని నిర్మిస్తున్నారు. గ్రావెల్‌తో కొత్త రహదారిని నిర్మించి, దానిపై మెటల్, బీటీ పోయాల్సి ఉంది. అయితే ఈ రహదారిని దక్కించుకున్న కాంట్రాక్టర్ నిబంధనలకు విరుద్ధంగా, నాసిరకం మట్టితో రహదారిని నింపేస్తున్నారు. పెద్ద పెద్ద రాళ్లు, సుద్దతో కూడిన మట్టితో రహదారిని నిర్మించేస్తున్నారు. పర్యవేక్షించాల్సిన అధికారులు ప్రేక్షకపాత్ర వహిస్తుండటంతో కోట్ల రూపాయలు నిధులు మట్టి పాలవుతున్నాయనే ఆరోపణలు వస్తున్నాయి. సుద్ద, చవుడుతో కూడిన మట్టిని, మెతక రాళ్లతో నిండి ఉన్న మట్టితో రహదారిని నిర్మించడం వల్ల భవిష్యత్‌లో రహదారి పూర్తిగా కుంగిపోయే అవకాశాలున్నాయి. రహదారి నిర్మించే సమయంలో అధికారులు రహదారిపైన పోసే మట్టి, మెటల్ వంటి మెటీరియల్ నాణ్యతను ధ్రువీకరించిన తరువాతే వాటి వినియోగానికి అనుమతులివ్వాల్సి ఉంటుంది. కాని ఇక్కడ ఆ నిబంధన లేవీ పాటించడం లేదు. కాంట్రాక్టర్ ఎంచుకున్న మట్టినే తోలుతుండటంతో రహదారి భవిష్యత్‌పై ఆందోళన వ్యక్తం అవుతుంది. పోసిన మట్టిపైన ప్రతి లేయర్‌కు రోలింగ్, వాటరింగ్ చేయాల్సి ఉండగా, క్షేత్రస్థాయిలో ఈ పద్ధతిలో జరుగడం లేదు. దీనిపై అధికారులు మిన్నకుండా ఉండటంపట్ల పలు విమర్శలు వ్యక్తం అవుతున్నాయి.


రహదారికోసం తోలిన రాళ్లతో కూడిన మట్టి

ప్రభుత్వ భూమి నుంచి మట్టి తోలకాలు..

సుద్ద, చవుడు, రాళ్లతో కూడిన నాసిరకం మట్టిని తోలుతూ రహదారి నిర్మాణంలో అక్రమాలకు పాల్పడుతున్న కాంట్రాక్టర్ ప్రభుత్వ అనుమతుల్లేకుండా మరికొన్ని అక్రమాలకు పాల్పడుతున్న సంఘటనలు వెలుగులోకి వచ్చాయి. రహదారి నిర్మాణంపై వస్తున్న ఆరోపణలు పరిశీలించేందుకు వెళ్లిన మీడియాను చూసిన మట్టిని తోలే ట్రిప్పర్లు పరారైపోయారు. దీనిపై ఆరా తీసిన మీడియాకు ఆసక్తికరమైన విషయాలు దృష్టికి వచ్చాయి. ఆర్‌అండ్‌బీ అధికారులు ధ్రువీకరించని మట్టిని ప్రభుత్వం నుంచి ఎటువంటి అనుమతుల్లేకుండానే అక్రమంగా ప్రభుత్వ భూమి నుంచి మట్టిని యథేచ్ఛగా తోలుతున్న విషయం వెలుగులోకి వచ్చింది. ఇప్పటికీ ఐదు రోజుల నుంచి రెండు ఎక్స్‌కవేటర్లు, నాలుగు ట్రాక్టర్లలో సుమారుగా 400పైన ట్రాక్టర్ల మట్టిని తోడేసినట్లు తెలిసింది. అధికార పార్టీ నాయకుల పేర్లుచెప్పి అధికారుల హెచ్చరికలను సహితం పెడచెవిన పెట్టి మరీ ఈ అక్రమాలకు పాల్పడుతున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. అధికారులు మిన్నకుండటాన్ని పరిశీలిస్తే ఈ ఆరోపణల్లో నిజం ఉండవచ్చుననే అనుమానం కలుగుతుంది. దీనిపై తహసీల్దార్ కృష్ణ ప్రసాద్‌ను వివరణ కోరగా తాము మట్టి తోలకాలకు ఎటువంటి అనుమతులు ఇవ్వలేదని చెప్పారు. అక్రమంగా మట్టిని తోలితే చర్యలు తీసుకుంటామని చెప్పారు.

ఆర్‌అండ్‌బీ డీఈఈ శ్రీనివాసరావును వివరణ కోరగా సుద్దమట్టిని తోలుతున్నట్టు తమ దృష్టికి వచ్చిందని, దీనిపై ఈఈకి రిపోర్టు చేస్తామని చెప్పారు.

సత్తుపల్లిలో సెల్‌టవర్ వివాదం

- అనుమతులు లేవంటూ టవర్ సామగ్రి తరలింపు
- తప్పుడు సమాచారం ఇచ్చారంటూ కమిషనర్ వివరణ

సత్తుపల్లిరూరల్, నవంబరు20 (ఆంధ్రజ్యోతి): పర్యావరణానికి హాని కలుగుతుందని, రోగాల బారిన పడుతున్నామని, పశుపక్ష్యాదులు మృత్యువాతకు గురవుతున్నాయని గతంలో సెల్‌టవర్లను నిర్మించవద్దంటూ వివాదాలు జరిగేవి. కానీ ఇప్పుడు తప్పుడు చిరునామాలో టవర్ నిర్మించి వినియోగిస్తున్నారని ఆరోపణలు రావడంతో యజమానికి, అధికారుల మధ్య తీవ్ర వాగ్వివాదం బుధవారం సత్తుపల్లిలో చోటుచేసుకుంది. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. ఇండస్ టవర్స్ లిమిటెడ్‌కు సంబంధించి ఓ సెల్‌ఫోన్ కంపనీకి చెందిన టవర్ నిర్మాణానికి సత్తుపల్లి మునిసిపాలిటీ నుంచి ఈ ఏడాది మే 2వ తేదీన అనుమతులను జారీచేసింది. సదరు యజమాని తన రెండు అంతస్థుల భవనంపై నిర్మించేందుకు అన్ని అనుమతులు తీసుకున్నాడు. ఈ క్రమంలో యజమానికి చెందిన ఆధార్ కార్డ్‌ను దరఖాస్తులో ఇవ్వగా అందులో ఉన్న చిరునామాకు, సెల్‌ఫోన్ నిర్మించిన స్థలం అడ్రస్ వేర్వేరుగా ఉన్న విషయం సత్తుపల్లి మునిసిపల్ కమిషనర్ మందా రవి దృష్టికి రావడంతో తన సిబ్బందితో టవర్ వద్దకు చేరుకున్నారు. ఈ క్రమంలో సదరు యజమానికి తనకు ఎటువంటి నోటీసులు ఇవ్వకుండా, ముందస్తు సమాచారం లేకుండా ఎలా టవర్‌ను తీసివేస్తారంటూ కమిషనర్‌తో వాగ్వాదానికి దిగారు. ఆ తర్వాత టవర్‌కు సంబంధించిన మెషిన్లు, ఇతర సామగ్రిని మునిసిపల్ సిబ్బంది స్వాధీనం చేసుకుని కార్యాలయానికి తరలించారు. ఈ విషయమై కమిషనర్ మాట్లాడుతూ అనుమతులు సమయంలో ఇచ్చిన అడ్రస్‌కు, టవర్ నిర్మితమైన ప్రదేశం వేర్వేరుగా ఉందని, అనుమతులు సమయంలో ఇచ్చిన ప్రాంతంలోనే టవర్ నిర్మించి వినియోగించాల్సి ఉందని వివరణ ఇచ్చారు.

ఎటువంటి ముందస్తు సమాచారం లేకుండా తమ ఇంటిపై టవర్‌కు సంబంధించిన సామగ్రిని మునిసిపల్ కమిషనర్ ఆధ్వర్యంలో స్వాధీనం చేసుకోవడం సరికాదని బాధితులు వాపోయారు. సెల్‌టవర్‌కు అనుమతుల సమయంలో తన భార్యకు సంబంధించిన ఆధార్ కార్డ్‌ను సమర్పించగా, అప్పటి చిరునామాలో ఉన్న ఇంటిని తాము ఎప్పుడో విక్రయించామని, నూతనంగా గత వారమే మసీద్ రోడ్‌లోని తమ ఇంటికి వచ్చామని బాధితుడు తెలిపారు. 7నెలల క్రితమే సెల్ టవర్‌ను నిర్మించగా 40రోజుల క్రితమే సిగ్నల్ కనెక్షన్ ఇచ్చారని, కానీ ఇప్పుడు కొత్తగా టవర్‌కు అనుమతుల విషయంలో తప్పుడు అడ్రస్ ఇచ్చానని వివాదం సృష్టించారని బాధితులు ఆరోపిస్తున్నారు.

భార్య ఇంటికి రావడం లేదని
భర్త ఆత్మహత్యాయత్నం


ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మస్తాన్

సత్తుపల్లిరూరల్, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): పుట్టింటికి వెళ్లిన భార్య తన వద్దకు రావడం లేదని ఓ వ్యక్తి బ్లేడుతో గొంతు కోసుకుని ఆత్మహత్యకు యత్నించిన ఘటన బుధవారం మండలంలోని బేతుపల్లిలో జరిగింది. సత్తుపల్లి పట్టణానికి చెందిన షేక్ ఇమ్రాన్ అనే వ్యక్తి మటన్ దుకాణంలో పనిచేస్తుంటాడు. ఏడాది క్రితం మండలంలోని బేతుపల్లికి చెందిన ఓ మహిళను ప్రేమ వివాహం చేసుకున్నాడు. ఇటీవల ఇద్దరి మధ్య మనస్పర్థలు రావడంతో భార్య పుట్టింటికి వెళ్లింది. ఈ క్రమంలో బుధవారం అత్తవారింటికి వెళ్లిన ఇమ్రాన్ భార్యను ఇంటికి రావాలని కోరాడు. దానికి ఆమె అంగీకరించకపోవడంతో ఒక్కసారిగా బ్లేడుతో గొంతు కోసుకున్నాడు. తీవ్రంగా గాయపడిన అతడిని వెంటనే కుటుంబ సభ్యులు సత్తుపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

ఆసుపత్రి వద్ద హైడ్రామా..

గొంతు వద్ద తీవ్ర గాయం రక్తస్రావంతో ఆసుపత్రికి వచ్చిన ఇమ్రాన్‌కు వైద్యులు, సిబ్బంది చికిత్స అందిస్తుండగా అతడు వారిని బలవంతంగా విదిలించుకుని తనకు వైద్యం వద్దని బయటకు వచ్చాడు. తరువాత కుటుంబ సభ్యులు మళ్లీ అతడిని తీసుకువెళ్లి వైద్యం చేయించారు. ప్రస్తుతం అతడి ఆరోగ్యం నిలకడగానే ఉంది. ఈ విషయంపై సత్తుపల్లి పోలీసులను వివరణ కోరగా తమకు ఎలాంటి సమాచారం గానీ, ఫిర్యాదుగానీ అందలేదని పట్టణ సీఐ టీ.కిరణ్ తెలిపారు.

'సామాజిక సేవలో ముందుంటాం'

కల్లూరు, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) సామాజిక సేవలో తాము కూడా భాగస్వాములై ముందుకు సాగుతామని తెలంగాణ రాష్ట్ర ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగుల సంఘం కార్యదర్శి ఎల్‌వి రెడ్డి చెప్పారు. బుధవారం కల్లూరులో నిర్వహించిన సత్తుపల్లి డివిజన్ ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగుల ఆత్మీయ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. జరిగింది. ఆర్టీసీ తరుపున విశ్రాంత ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి తమ వంతుగా కృషి చేస్తామన్నారు. ఇప్పటికే సంఘ పోరాట ఫలితంగా అనేక సమస్యలను పరిష్కరించుకోవడం జరిగిందిని చెప్పారు. ఈ నెల 30న సత్తుపల్లి డివిజన్ పరిధిలో గల ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగుల వనసమారాధనా నిర్వహించనున్నట్లు తెలిపారు. విశ్రాంత ఆర్టీసీ ఉద్యోగి లక్కినేని నరేంద్ర బాబు ఉమామహేశ్వరి దంపతులు సంఘ సంక్షేమాభివృద్ధికి రూ. 10వేలు వితరణ చేశారు. ఈ సమావేశంలో సత్తుపల్లి ఆర్టీసీ డిపో విశ్రాంత ఉద్యోగుల సంఘ అధ్యక్షుడు జీవీ. రావు, కార్యదర్శి యస్‌పి రావు, రీజియన్ అసిస్టెంట్ సెక్రటరీ స్వామిదాసు, కోశాధికారి వెంకటేశ్వరరావు, సుధాకర్, నారాయణ, వెంకన్న తదితరులున్నారు.

రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు
ఏన్కూర్ విద్యార్థుల ఎంపిక

ఏన్కూరు, నవంబరు20(ఆంధ్రజ్యోతి): ఏన్కూరులో సోమవారం జరిగిన సాఫ్ట్‌బాల్ జిల్లాస్థాయి పోటీలలో ఓంఆదిత్య గాయత్రి స్కూల్ విద్యార్థులు ఓగుల తరుణ్‌షాయి, జోగా సాత్విక్‌లు రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించారని ప్రిన్సిపాల్ దాసరి రమేష్ బుధవారం ప్రకటనలో తెలిపారు. ఈనెల 23, 24 తేదీలలో మెదక్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. ఈసందర్భంగా విద్యార్థులను మాజీ ఎంపీటీసీ లచ్చిరాం, కరస్పాండెంట్ అంతోటి రామకృష్ణ, ప్రిన్సిపాల్ దాసరి రమేష్ అభినందించారు.

కూసుమంచి శివాలయం హుండీ లెక్కింపు



కూసుమంచి, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): కూసుమంచి మండలకేంద్రంలోని పురాతన శివాలయంలో బుధవారం అధికారులు హుండీ లెక్కించారు. కార్తీకపౌర్ణమి వేడుకలు ముగిశాయి. దీంతో ఆదాయాన్ని లెక్కించారు. హుండీ ద్వారా రూ.1,28,540, అర్చనల ద్వారా రూ.21వేలు, అభిషేకాల ద్వారా రూ.25,250, గర్భాలయ అభిషేకాల ద్వారా రూ.77,400, కట్నకానుకలు రూ.లక్షా 7వేలు, మొత్తం రూ.3,59,190 ఆదాయం లభించినట్లు ఆలయ ఈవో శ్రీకాంత్ తెలిపారు.

అభివృద్ధిలో ముందంజ

» కొన్ని ప్రాంతాల్లో డ్రెయినేజీ సమస్యలు
» టెండర్లు నిర్వహించినా ప్రారంభంకాని పనులు
» 50వ డివిజన్‌లో ఇవీ సమస్యలు



డివిజన్‌లో సీసీ రహదారి, నూతనంగా నిర్మించిన డ్రెయినేజీ

ఖమ్మంటౌన్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): నగరంలోని 50వడివిజన్ అభివృద్ధిలో ముందంజలో ఉంది. అయితే డివిజన్‌లోని కొన్ని ప్రాంతాల్లో డ్రెయినేజీ సమస్యలు నెలకొన్నాయి. పరిధి ఎక్కువగా ఉన్న ఈ డివిజన్‌లో గతంలో సమస్యలు ఎక్కువగా ఉండేవి. తరువాత అభివృద్ధిపనులు చేయటంతో ప్రజలకు మౌళిక సదుపాయాలు సమకూర్చగలిగారు. కాగా పురాతనమైన రాళ్లతో నిర్మించిన డ్రెయినేజీలు ఉండటంతో అవి ధ్వంసం అయి మురుగును పారించలేకపోతున్నాయి. చాలా వరకు కొత్త డ్రెయినేజీలు నిర్మించినప్పటికీ కొన్ని ప్రాంతాల్లో సమస్య అలాగే ఉంది. రహదారులకు ప్యాచ్ వర్క్‌లు చేయవలసి ఉండగా, వాటినిమిత్తం టెండర్లు నిర్వహించినా పనులు చేపట్టలేదు. చిన్న సమస్యలు తప్ప డివిజన్ అభివృద్ధిపథంలోనే ఉంది.

డివిజన్‌లో నెలకొన్న సమస్యలివీ

డివిజన్‌లో డ్రెయినేజీ సమస్య నెలకొంది. పురాతనంగా రాతికట్టడాలతో అప్పట్లో డ్రెయినేజీలు నిర్మించారు. అవి ధ్వంసం కావటంతో శిథిలావస్థకు చేరుకున్నాయి. డివిజన్‌లోని బుర్హాన్‌పురం, రాపర్తినగర్ తదితర ప్రాంతాల్లో ఈ సమస్య ఉంది. డివిజన్ పరిధి ఎక్కువ విస్తీర్ణంలో ఉన్నా కేవలం 10మంది కార్మికులను కేటాయించారు. అందులో ముగ్గురు కార్మికులు చెత్తతరలించే ట్రాక్టర్‌లో విధులు నిర్వహిస్తుంటే, మరో ఇద్దరికి వీధులు ఊడ్చే విధులు అప్పగించారు. మరొకరికి స్వచ్ఛభారత్ ఆటో ద్వారా ఇంటింటికి చెత్తసేకరించే విధులు అప్పగించారు. మిగిలిన నలుగురు కార్మికులు మాత్రమే పెద్ద డివిజన్‌లో పారిశుధ్య పనులు చేయాల్సి వస్తోంది. దీంతో కాలువల్లో మురుగు తొలగించే పనులు తదితరు విషయాల్లో కొంత జాప్యం జరుగుతోంది. రాపర్తినగర్‌లోని పెట్రోల్‌బంక్ వెనుక ప్రాంతంలో వీధిదీపాలు వెలగకపోవటంతో చిమ్మచీకటి నెలకొంది. అక్కడ మద్యపానం చేసేవారు, గంజాయి తాగేవారు తిష్టవేసి గొడవలు సృష్టిస్తున్నారు. డివిజన్‌లో వీధికుక్కల సమస్య ఉంది. రహదారులకు ప్యాచ్‌వర్క్‌లు చేసేందుకు టెండర్లు నిర్వహించినా పనులు ప్రారంభించపోవటంతో కొన్ని ప్రాంతాల్లో రహదారులు గతుకుల మయంగా మారాయి. డివిజన్‌లో ఖాళాస్థలాల్లో చెత్త పెరిగి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

డివిజన్ స్వరూపం

విస్తీర్ణం: సుమారు 4కిలోమీటర్లు
జనాభా: 6500, ఓటర్లు:5400
డివిజన్ ప్రాంతాలు: బుర్హాన్‌పురం, మామిళ్లగూడెం, చెరువుకట్ట, రాపర్తినగర్ 1,2,3 రమణగుట్టలోని కొంతప్రాంతం.
కార్పొరేటర్: రాపర్తి శరత్‌కుమార్
ఫోన్: 94940 43399

డివిజన్‌లో జరిగిన అభివృద్ధి ఇదీ.

డివిజన్‌లో రూ.4కోట్ల వ్యయంతో అభివృద్ధిపనులు చేపట్టారు. డివిజన్‌లోని చెరువుకట్ట, పాత డీఆర్‌డీఏ తదితర ప్రాంతాల్లో పాత డ్రెయినేజీలను తొలగించి రూ.20లక్షల వ్యయంతో కొత్తడ్రెయినేజీలు నిర్మించారు. రమణగుట్ట ప్రాంతంలో తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు పైప్‌లైన్లు ఏర్పాటు చేశారు. అక్కడే విద్యుత్ లోఓల్టేజీతో ప్రజలు ఇబ్బందులు పడుతుంటే త్రీఫేజ్ కరెంట్ ఏర్పాటు చేసి, సమస్యలను పరిష్కరించారు. రమణగుట్ట ఎస్సీ కాలనీలో రహదారి అధ్వానంగా ఉండడటంతో రూ.15లక్షలతో సీసీ రహదారి నిర్మాణం చేపట్టారు. అలాగే కరెంట్ ఆఫీస్ నుంచి కూరగాయల మార్కెట్ వరకు రహదారి గుంతలమయం కావటంతో అక్కడ సీసీ రహదారిని నిర్మించారు. నూతన బస్టాండ్, బైపాస్ రోడ్, బుర్హాన్‌పురం ఆర్టీసీ కాలనీ, పీవీ నర్సింహారావు పార్కు తదితర ప్రాంతాల్లో సుమారు రూ.కోటి వ్యయంతో డ్రెయినేజీ నిర్మాణాలు చేపట్టారు. రూ.15లక్షలంతో చేపట్టే రహదారి ప్యాచ్ వర్క్‌పనులకు టెండర్ల ప్రక్రియ పూర్తయింది. సుడా నిధులు రూ.50లక్షలు డివిజన్‌కు కేటాయించగా, పనులకు ప్రతిపాదనలు పంపారు.



ఖాళీస్థలాల్లో పెరిగిన పిచ్చిమొక్కలు

డ్రెయినేజీ వ్యవస్థను మెరుగుపరచాలి

నాగళ్ల ఆనంద్‌బాబు



డివిజన్‌లో పలు అభివృద్ధి పనులు చేసినప్పటికీ, కొన్నిప్రాంతాల్లో డ్రెయినేజీ సమస్య నెలకొంది. శిథిలమైన డ్రెయినేజీలను తొలగించి కొత్తవి నిర్మించాలి. వీధికుక్కల సమస్య ఎక్కువగా ఉంది. కార్పొరేటర్ పలుసార్లు అధికారుల దృష్టికి తెచ్చినా పట్టించుకోవటం లేదు. అలాగే డివిజన్‌లో ఖాళీస్థలాలు ఉన్నాయి. యజమానులు వాటిని పట్టించుకోకపోవటంతో పిచ్చిమొక్కలు పెరిగాయి.

అన్నీ ఉన్నా, వీధిదీపాలు లేవు

గుడిపుడి వీరయ్య



డివిజన్ ఎంతో అభివృద్ధి చెందింది. పలు మౌళిక వసతులు అన్నీ ఉన్నా వీధిదీపాలు వెలగటం లేదు. దీంతో పలు ప్రాంతాలు చీకటిమయంగా ఉంటున్నాయి. అక్కడ అసాంఘిక శక్తులు చేరి, ప్రజలను భయభ్రాంతులను చేస్తున్నాయి. రాపర్తినగర్ పెట్రోలుబంక్ వెనుక వీధిదీపాలు లేకపోవటంతో అసాంఘిక శక్తులకు అడ్డాగా మారుతున్నాయి. అధికారులు వెంటనే వీధిదీపాలు ఏర్పాటు చేయాలి.

నిధుల కోసం మంత్రి తుమ్మల దృష్టికి

రాపర్తి శరత్‌కుమార్, కార్పొరేటర్



డివిజన్‌లో మిగిలిన అభివృద్ధిపనులు పూర్తి చేయాలంటే కోటిరూపాయల నిధులు కావాలి. నిధుల మంజూరు కోసం మంత్రి తుమ్మల నాగేశ్వరరావు దృష్టికి తీసుకువెళతాను, డివిజన్‌లోని బుర్హాన్‌పురం, ఆర్టీసీ కాలనీ1,2 ప్రాంతాల్లో డ్రెయినేజీలు నిర్మించాల్సి ఉంది. ఇంకా రహదారులకు ప్యాచ్‌వర్క్‌లు, మరమ్మతులు చేపట్టాల్సి ఉంది. నిధులు కేటాయిస్తే డ్రెయినీజీలు నిర్మించి మురుగు సమస్య పరిష్కరిస్తాం.

రైతుబజార్ కూరగాయల ధరలు

కూరగాయలు ధరలు
(కిలో ఒక్కంటికి రూపాయల్లో)

టమాటా	46రూ.
వంకాయ	40
గుత్తి వంకాయ	50
బీరకాయ	48
పచ్చిమిర్చి	28
కాకరకాయ	34
బెండకాయ	24
పొట్లకాయ	44
దొండకాయ	34-40
నాటుచిక్కుడు	120
గోరుచిక్కుడు	44
క్యాబేజీ	38
దోస	34-58
సొరకాయ	28
క్యారెట్	74
క్యాప్సికం	64
ఆలుగడ్డ	38
ఉల్లిగడ్డ	60-70
కోడిగుడ్ల ట్రే (30 గుడ్లు)	170
కొత్తిమీర కట్ట	40

- ఆంధ్రజ్యోతి, ఖమ్మం మార్కెట్

CINEMA సినిమా

నగరంలో చిత్రాలు..

వినోద:	లక్కీభాస్కర్
శ్రీనివాస:	అమరన్
సాయిరాం:	మట్కా
కేపీఎస్:	కంగువ
తిరుమల:	దేవర
సినీ గెలాక్సీ:	క

ముగిసిన గ్రంథాలయ వారోత్సవాలు

ఖమ్మం ఖానాపురంహవేలి నవంబరు 20(ఆంధ్రజ్యోతి): ఖమ్మం నగరంలోని జిల్లా కేంద్ర గ్రంథాలయంలో జాతీయ 57వ గ్రంథాలయ వారోత్సవాలు బుధవారంతో ముగిశాయి. ముగింపు కార్యక్రమానికి డిప్యూటీ మేయర్ పాతిమా జోహరా హజరై ఆటల పోటీలలో, ముగ్గుల, వ్యాసరచన పోటీలలో విజేతలకు బహుమతులు అందించారు. గ్రంథాలయంలో చదివి గ్రూప్ 4లో ఏఈ ఎక్సైజ్ శాఖలో ప్రభుత్వ ఉద్యోగం సాధించిన వారిని సన్మానించారు. కార్యక్రమంలో గ్రంథాలయ ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

పారిశుధ్య వాహనాలపై నిరంతర పర్యవేక్షణ

కేఎంసీలో జీపీఎస్ కంట్రోల్ రూమ్

ఖమ్మం సంక్షేమ విభాగం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం నగర పాలక సంస్థ పరిధిలోని పారిశుధ్య వాహనాలపై ఇక నిరంతర నిఘా వెంటాడనుంది. ఇప్పటికే 160 వాహనాలకు జీపీఎస్‌లు ఏర్పాటు చేశారు. కానీ పలు కారణాలతో ఎప్పుడు 25నుంచి 30 వాహనాల జీపీఎస్‌లు పనిచేయటం లేదు. దీంతో ప్రక్షాళన దిశగా కమిషనర్ అభిషేక్ ఆగస్త్య ముందడుగు వేశారు. పారిశుధ్య వాహనాల జీపీఎస్ పర్యవేక్షణకు కేఎంసీలో ప్రత్యేకంగా కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేయబోతున్నారు. ఇందులో ముగ్గురు వ్యక్తులు ఉండి నిరంతరం వాహనాల కదలికలను రికార్డు చే స్తూ సాంకేతిక సమస్యలు తలెత్తితే వెంటనే పరిష్కారం చేసేందుకు చర్యలను చేపటనున్నారు. కంట్రోల్ రూమ్ ఏర్పాటును బుధవారం కమిషనర్ పరిశీలించి సూచనలు చేశారు.

రేపు ఎంపీ రేణుకాచౌదరి పర్యటన

ఖమ్మం సంక్షేమ విభాగం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): కేంద్ర మాజీ మంత్రి, రాజ్యసభ సభ్యురాలు రేణుకాచౌదరి శుక్రవారం ఉమ్మడి ఖమ్మం జిల్లాలో పర్యటించనున్నారు. ఈ మేరకు బుధవారం క్యాంపు కార్యాలయం నుంచి పత్రికా ప్రకటన విడుదల చేశారు. పాలేరు, ఖమ్మం, ఇల్లెందు, ఇతర నియోజకవర్గాల్లో రేణుకాచౌదరి పర్యటిస్తారు.

చుక్కా రామయ్య రచనలు ఆవిష్కరణ

ఖమ్మం ఖానాపురంహవేలి, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): ప్రముఖ విద్యావేత్త చుక్కా రామయ్య 98వ జన్మదినోత్సవం సందర్భంగా ఉమ్మడి ఖమ్మం జిల్లాలో 50 ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఆయన రాసిన విద్యారంగపుస్తకాల ఆవిష్కరణ నిర్వహించారు. బుధవారం నగరంలోని ప్రభుత్వ కళాశాల నయబజార్‌లో చుక్కా రామయ్య రాసిన మొదటి పాఠం, ఓనమాలు, జ్ఞాపకాలు, నడక, బడిపంతుళ్ళకు రాజకీయాలు, లెక్కలతో నా ప్రయోగాలు, పుస్తకాలను కళాశాల ప్రిన్సిపాల్ కెఎస్ రామారావు, అధ్యాపకులు ఆవిష్కరించారు. విద్యారంగంపై రాసిన పుస్తకాలను, ఐఐటీ కోసం ఆయన చేసిన కృషిని విద్యార్థులకు వివరించారు.

3లోగా దరఖాస్తులు అందజేయాలి

ఖమ్మం ఖానాపురంహవేలి నవంబరు 20(ఆంధ్రజ్యోతి): 2025 జనవరిలో జరగనున్న డ్రాయింగ్, టైలరింగ్, ఎంబ్రాయిడరి (టీసీసీ) లోయర్, హయ్యర్ పరీక్షలకు ఎలాంటి అపరాద రుసుం లేకుండ డిసెంబరు 3లోగ ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోని పరీక్ష ఫీజు చెల్లించాలని డీఈవో సోమశేఖర శర్మ తెలిపారు. రూ.50ల అపరాద రుసుంతో డిసెంబరు 10 వరకు, రూ.75ల అపరాద రుసుంతో డిసెంబరు 17 వరకు ఫీజు చెల్లించి ఆన్‌లైన్లో దరఖాస్తులు చేసుకోవాలని తెలిపారు. విద్యార్హత సర్టిపికెట్లను గెజిటెడ్ అధికారితో ధృవీకరించి డీఈవో కార్యాలయంలో అందించాలని తెలిపారు. వివరాలకు కార్యాలయంలో సంప్రదించాలని తెలిపారు.

కూసుమంచి ఎంపీడీవోగా ట్రైనీ కలెక్టర్ మృనాల్

కూసుమంచి, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): కూసుమంచి ఎంపీడీవోగా ట్రైనీ అసిస్టెంట్ కలెక్టర్ మృనాల్ శ్రేష్ట బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుత ఎంపీడీవో వేణుగోపాలరెడ్డి నుంచి బాధ్యతలు స్వీకరించారు. ఐఏఎస్ శిక్షణలో భాగంగా మూడువారాల పాటు బాధ్యతలు నిర్వర్తించనున్నారు. ఈమేరకు ఎంపీవో రామచంద్రరావు, ఐకేపీ ఏపీఎం, ఏపీవో, కార్యాలయ సిబ్బంది ట్రైనీ అసిస్టెంట్ కలెక్టర్‌ను అభినందించారు.

24న ఎస్‌ఎఫ్‌ఐ పూర్వ విద్యార్థుల సమ్మేళనం

ఖమ్మంటౌన్, నవంబర్ 20 (ఆంధ్రజ్యోతి): ఎస్ఎఫ్ఐ పూర్వ విద్యార్థుల వేదిక ఆధ్వర్యంలో ఖమ్మంలోని ఎస్ఆర్ గార్డెన్స్ సీతారాం ఏచూరి ప్రాంగణంలో ఈనెల 24, ఆదివారం ఉమ్మడి ఖమ్మంజిల్లా ఎస్ఎఫ్ఐ ఆత్మీయ సమ్మేళనం నిర్వహించనున్నట్లు కార్యక్రమ కన్వీనర్ వెల్లంపల్లి శ్రీనివాసరావు, ఎస్ఎఫ్ఐ పూర్వ విద్యార్థుల వేదిక కన్వీనర్ సుబ్బారావు తెలిపారు. బుధవారం నగరంలోని మంచికంటి మీటింగ్ హాల్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఈ సమ్మేళనానికి ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఎస్ఎఫ్ఐ పూర్వ విద్యార్థులు సుమారు 1000నుంచి 1500మంది హాజరవుతారన్నారు. కార్యక్రమానికి ముఖ్యవక్తలుగా ప్రొఫెసర్ కే.నాగేశ్వర్, ఎస్ఎఫ్ఐ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ కార్యదర్శి కృష్ణయ్య హాజరవుతారన్నారు. సమావేశంలో కో-కన్వీనర్ రాజేశ్వరరావు, పూర్వ విద్యార్థి జావీద్ పాల్గొన్నారు.

పుస్తక పరిజ్ఞానానికి దూరం కావద్దు

ఖమ్మం ఖానాపురంహవేలి, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు డిజిటల్ ప్రపంచానికి బానిసలై పుస్తక పరిజ్ఞానానికి దూరం కావద్దు అని జిల్లా ఉపాధి కల్పనాధికారి ఎస్ మాధవి అన్నారు. బుధవారం నగరంలోని ప్రభుత్వ ఏఎస్ఆర్ జూనియర్ కాలేజీ శాంతినగర్ ఇంటర్మీడియట్ ప్రథమ, ద్వితీయ సంవత్సర విద్యార్థులకు, డిగ్రీ ద్వితీయ సంవత్సరం పూర్తి చేసిన తరువాత వివిధ రంగాల్లో ఎంచుకోవాల్సిన ఉపాధి మార్గలను వివరించారు. వివిధ పోటీ పరీక్షలు నిర్వహించే ఎస్ఎస్‌సీ, యూపీఎస్, ఐబీపీఎస్, ఆర్ఆర్‌బీ, పరీక్ష సరళిపై విద్యార్థులకు వివరించారు. భవిష్యత్తులో ఏ రంగాన్ని ఎంచుకోవాలన్న పాఠ్యాంశాలపై పట్టు సాధించాలన్నారు. కార్యక్రమంలో కళాశాలల ప్రిన్స్‌పాల్స్, అధ్యాపకులు పాల్గొన్నారు.

'న్యూవిజన్'లో సంస్కృతి మహోత్సవం



వివిధ వేషధారణలో విద్యార్థులు

ఖమ్మం ఖానాపురంహవేలి నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): నగరంలోని న్యూవిజన్ పాఠశాలలో బుధవారం సంస్కృతి మహోత్సవం ఘనంగా నిర్వహించారు. వివిధ రాష్ట్రాల వారి వేషధారణ సంస్కృతి ప్రతిబింబజేయుటకు ఈ కార్యక్రమం నిర్వహించినట్లు ప్రైమరీ ప్రిన్సిపాల్ మాధవి తెలిపారు. దేశంలోని వివిధ రా ష్ట్రాల వేషధారణలు ప్రదర్శించినట్లు తెలిపారు.

చిత్రలేఖనం పోటీలో బహుమతులు

నగరంలోని శ్రీకృష్ణ సాయి ఆశ్రమం నగరస్థాయిలో పాఠశాల విద్యార్థులకు నిర్వహించిన చిత్రలేఖనం పోటీలలో న్యూవిజన్ విద్యార్థులు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతుల తోపాటు కన్సోలేషన్ బహుమతులు సాధించారని ప్రిన్సిపాల్ ఎండి అబాద్ అలీ తెలిపారు. విజేతలను పాఠశాల అకాడమిక్ డైరెక్టర్ సిహెచ్ కార్తీక్ అబినందించారు.

వరి కొయ్యలు తగులబెట్టడం వల్ల నష్టమే

నేలకొండపల్లి, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): వరి పంట కోసిన అనంతరం వరి కొయ్యలను తగులబెట్టటం వలన రైతుల పొలాలకు మాత్రమే గాక పర్యావరణానికి కూడా తీవ్ర నష్టం కలుగుతుందని మండల వ్యవసాయాధికారి ఎం.రాధ రైతులతో అన్నారు. మండల పరిధిలోని చెన్నారం రెవెన్యూ పరిధిలోని వరి పంటను కోసిన అనంతరం వరికొయ్యలను తగులబెడుతున్న రైతులను వ్యవసాయాధికారులు నిలువరించారు. వరికొయ్యలను కాలబెడుతున్న రైతులకు నచ్చజెప్పి ఆర్పించారు.పొలంలో వరికొయ్యలను తగుల బెట్టటం వలన పొలంలో ఉన్న వానపాములు చనిపోతాయని తద్వారా సేంద్రీయ ఎరువు తయారీ నిలిచిపోతుందన్నారు. వరికొయ్యలను తగులబెట్టకుండా, నీరు పెట్టి దున్నటం వలన ఎరువుగా పని చేస్తాయన్నారు. ఏఈఓ భవాని, రైతులు ఆలగడప రాఘవులు, కిలారు సత్యనారాయణలు పాల్గొన్నారు.

ఖాళీ ఇళ్ల స్థలాల్లో చెత్త పెరిగితే

రూ.10వేల జరిమాన

ఖమ్మం సంక్షేమ విభాగం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం నగరంలో పారిశుధ్య కార్యక్రమాల నిర్వహణకు ఖాళీ స్థలాలు పెద్ద సమస్యగా మారాయి. దీంతో కేఎంసీ కమిషనర్ అభిషేక్ ఆగస్త్య ఆదేశాల మేరకు పారిశుధ్య పర్యవేక్షకులు సాంబయ్య బుధవారం జరిమానాలకు శ్రీకారం చేశారు. గతంలో అనేక పర్యాయాలు నోటీసులు జారీ చేసిన స్పందించని ఓ ఖాళీ స్థలం యజమానికి రూ.10వేలు జరిమాన విధించారు. ఖాళీ స్థలాల్లో చెత్త పెరిగితే వెంటనే తొలగించుకోవాలని లేకుంటే జరిమానాలు విధిస్తామని హెచ్చరించారు.

ప్రతీ ధాన్యపు గింజను కొనుగోలు చేస్తాం: డీఏవో

తిరుమలాయపాలెం, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): రైతులు పండించిన ప్రతి ధాన్యపు గింజను ప్రభుత్వం కొనుగోలు చేసి మద్దతు ధర ఇస్తుందని జేడీఏ పుల్లయ్య అన్నారు. బుధవారం మండలంలోని బీరోలులో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన పరిశీలించారు. అలాగే గోల్‌తండా వద్ద జిన్నింగ్ మిల్లు వద్ద సీసీఐ కేంద్రాన్ని పరిశీలించారు. అనంతరం బీరోలులోని జిల్లాపరిషత్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఖరీఫ్‌లో రైతులు పండించిన ప్రతి గింజను ప్రభ్తువం కొనుగోలుచేస్తుందని రైతులు దళారీలకు అమ్మి నష్టపోవద్దన్నారు. ప్రభుత్వం ఏర్పాటుచేసిన కొనుగోలు కేంద్రాలల్లో అమ్మి మద్దతు ధర పొందాలన్నారు. అలాగే సీసీఐ కేంద్రాలకు రైతులు తీసుకవచ్చే పత్తి విషయంలో సీసీఐ అధికారులు రైతులు ఎలాంటి ఇబ్బందులు గురిచేయవద్దన్నారు. ఈకార్యక్రమంలో ఏవోసీ తారాంరెడ్డి, ఏపీఎం అలివేలుమంగ, ఏఈవోలు నవనీత, బాలకృష్ణ, పాల్గొన్నారు.

ఎస్‌బీఐటీలో హనీవెల్ యూత్ ఎంపవర్‌మెంట్ ప్రోగాం

ఖమ్మం ఖానాపురంహవేలి నవంబరు 20(ఆంధ్రజ్యోతి): నగరంలోని ఎస్‌బీఐటీ ఇంజనీరింగ్ కళాశాలలో బుధవారం 15 రోజులు హనీవెల్ యూత్ ఎంపవర్‌మెంట్ ప్రోగ్రాంను కళాశాల చైర్మన్ గుండాల కృష్ణ ప్రాంభించి మాట్లాడారు. ఆర్టిఫిషియల్ ఇంటిలిజన్స్, జనరేటీవ్ ఏఐలు ప్రపంచాన్ని శాసిస్తున్నాయని వాటిపై విద్యార్థులకు పూర్తి అవగాహన ఉండటం ఎంతో అవసరమన్నారు. ఆధునిక కోర్సులపై విద్యార్థులు పట్టు సాధించాలన్నారు. తమిళనాడుకు చెందిన ఐసీటీ అకాడమి హనీవెల్ సంస్థ ఆధ్వర్యంలో ఎస్‌బీఐటి విద్యార్థులకు ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ పై శిక్షణ అందించి శిక్షణ పొందిన విద్యార్థులకు సర్టిపికెట్లు అందిస్తామని కళాశాల సెక్రటరి, కరస్పాండెంట్ డాక్టర్ జి ధాత్రీ అన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ రాజ్‌కుమార్, సంస్థ ప్రతినిధులు, కళాశాల డైరెక్టర్స్ పాల్గొన్నారు.

రూ.12వేలు జీవనభృతి ఇవ్వాలి: ఏఐపీకేఎంఎస్

తిరుమలాయపాలెం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయకూలీలకు ఏడాదికి రూ.12వేలు జీవనభృతి ఇవ్వాలని ఏఐపీకేఎంఎస్ రాష్ట్రనాయకులు బందెల వెంకయ్య తెలిపారు. బుధవారం మండలంలోని పిండిప్రోలు లో జరిగిన సంఘ సమావేశంలో ఆయన మాట్లాడారు.ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ఆరుగ్యారంటీలతో అధికారంలోకివాటిని అమలుచేయడంలేదన్నారు.. ఎటువంటి షరతులు లేకుండా రూ.2లక్షల రుణమాఫీ రైతులకు చేయాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వ్యవసాయకూలీలకు చేసిందేమిలేదన్నారు.

'మాలల సింహగర్జన'జయప్రదం చేయాలి

ఖమ్మంచర్చికాంపౌండ్, నవంబరు20(ఆంధ్రజ్యోతి): డిసెంబరు 1న హైదరాబాదులోజరిగే మాలల సింహగర్జన సభను జయప్రదం చేయాలని ఎస్సీవర్గీకరణ వ్యతిరేక పోరాట కమిటీ రాష్ట్ర కన్వీనర్ గోపోజు రమేష్ తెలిపారు. బుధవారం ఖమ్మంలోని అంబేద్కర్‌భవన్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు.ఎస్సీవర్గీకరణ వ్యతిరేక పోరాట కమిటీ ఖమ్మంజిల్లా కన్వీనర్ గుంతేటి వీరభద్రం, లింగాల రవికుమార్, దామల్ల సత్యం,పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

ఖమ్మం సంక్షేమ విభాగం, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): ఖమ్మం నగరంలోని 8వ డివిజన్‌లో స్థానిక కార్పొరేటర్ లకావత్ సైదులు నాయక్ సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చొరవతో మంజూరు జరిగిన చెక్కులను బుధవారం లబ్దిదారుల నివాసాలకు వెళ్లి ప్రభుత్వం మంజూరు చేసిన చెక్కులను అందించారు.

అర్హులైన జర్నలిస్టులందరికీ ఇళ్ల స్థలాలు

ఖమ్మంచర్చికాంపౌండ్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): అర్హులైన జర్నలిస్టులందరికి ఇళ్లస్థలాలు వచ్చేలా కృషిచేస్తామని జర్నలిస్టులంతా సంఘటితంగా ముందుకు పోవడం జరుగుతుదని, స్తంభాద్రి జర్నలిస్టు మ్యూచువల్లీ ఎయిడెడ్ కో ఆపరేటివ్ హౌజ్‌బిల్డింగ్ సొసైటీ అధ్యక్షుడు కనకం సైదులు పేర్కొన్నారు. ఖమ్మం ప్రెస్‌క్లబ్‌లో బుధవారం సొసైటీ నుంచి సీనియర్ జర్నలిస్టులకు సభ్యత్వ పంపిణీ కార్యక్రమాన్ని టీయూడబ్ల్యూజే(ఐజేయూ) జిల్లా అధ్యక్షుడు వనం వెంకటేశ్వర్లు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.రాంనారాయణ , టీయుడబ్ల్యుజే(టీజెఎఫ్)జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఆకుతోట ఆదినారాయణ, చిరారవి, టీయుడబ్ల్యుజేఎఫ్ జిల్లా అధ్యక్షుడు పల్లాకొండలరావు, యూనియన్ రాష్ట్రనాయకులు సాతుపాటి రామయ్య ఆధ్వర్యంలో ప్రారంభించారు. ఈసందర్భంగా జర్నలిస్టు సంఘాల నాయకులు, జర్నలిస్టు సొసైటీ నాయకులు సంయుక్తంగా మాట్లాడారు. నిబంధనలప్రకారం అర్హులైన జర్నలిస్టులందరికి ఇళ్లస్థలాలు వచ్చేలా కృషిచేస్తామని, సభ్యత్వనమోదుకు సీనియారిటీ ప్రకారంగా సభ్యత్వాలు ఇవ్వడం జరుగుతుందని తెలిపారు.

వైద్య విద్యార్థులకు నైతికతను బోధించాలి

» అభ్యాసన పద్ధతులను మెరుగుపరుచుకోవాలి » అవగాహన సదస్సులో డాక్టర్ ఎస్వీఎన్ రెడ్డి



అవగాహన కల్పిస్తున్న ఎంఎస్‌వీ రెడ్డి

ఖమ్మం కలెక్టరేట్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): 'విద్యార్థులకు నైతికతను.. మానవ సంబంధాలను మెరుగుపరిచేలా బోధన ఉండాలని' వరంగల్, ఖమ్మం మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్స్ డాక్టర్ ఎస్వీఎన్ రెడ్డి, డాక్టర్ రాజేశ్వరరావు ఉద్బోధించారు. మారుతున్న కాలానికి అనుగుణంగా అభ్యాసన పద్ధతులను మెరుగుపరుచుకోవాలని వారు సూచించారు. బుధవారం ఖమ్మం ప్రభుత్వ మెడికల్ కళాశాలలో అధ్యాపకులకు అభ్యాసన, మూల్యాంకన పద్ధతులపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. వారు మాట్లాడుతూ విద్యార్థులకు నైతిక విలువలపట్ల విశ్వాసాన్ని కల్గించాలన్నారు. సబ్జక్టును బోధించడంలో మెళకువలను పాటించి విద్యార్థులకు వైద్య విద్య పట్ల ఆసక్తిని రేకె త్తించాలన్నారు. ప్రతి బోధనాచార్యులుఎప్పటికప్పుడు మారుతున్న కాలానికి అనుగుణంగా మారుతూ అలాంటి అంశాలను విద్యార్థులకు బోధించాల్సి ఉందన్నారు. డాక్టరుగా చేయాల్సిన విధులు, విషయాన్ని బోధించేటప్పుడు వారిలో ఆసక్తిని కలిగించే విధానాలను అధ్యాపకులకు విపులంగా వివరించారు. ఇలాంటి కార్యక్రమాన్ని మొట్టమొదటి సారిగా ఖమ్మం మెడికల్ కళాశాలలో అధ్యాపకులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో 30 మంది అధ్యాపకులతో పాటు ప్రొఫెసర్లు డాక్టర్ యామినీ, శోభావాణి, డాక్టర్ ఎండీ మసూద్ పాషా, డాక్టర్ సమత తదితరులు పాల్గొన్నారు.



దేవాలయానికి రూ.లక్ష వితరణ

తల్లాడ, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): తల్లాడ మండలం మల్లవరం గ్రామ ప్రధాన కూడలిలోని ప్రసన్నాంజనేయస్వామి దేవాలయానికి వ్యాపారవేత్త బండారు ఉపేంద్రం బుధవారం రూ.లక్ష విరాళంగా అందజేశారు. విరాళం అందజేసిన దాతను దేవాలయ కమిటీ నిర్వాహకులు సన్మానించారు. కార్యక్రమంలో సొసైటీ వైస్‌చైర్మన్ కటికి నర్సింహారావు, చాపల భిక్షమయ్య, దుగ్గిదేవర వెంకట్‌లాల్, కటికి వెంకటేశ్వర్లు(కేవీ), నల్లగొండ శేషయ్యయ, కొరళ్ల పెద్ద సత్యం పాల్గొన్నారు.

'యాంటిబయోటిక్ మందులను అధికంగా వాడొద్దు'

తల్లాడ, నవంబరు20(ఆంధ్రజ్యోతి): ప్రజలు విచ్చలవిడిగా యాంటీబయోటిక్ మందులు వాడొద్దని అవగాహన కల్పిస్తూ తల్లాడలో బుధవారం వైద్యఆరోగ్య సిబ్బంది ప్రతిజ్ఞ చేశారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డాక్టర్ ఐ.రత్నమనోహర్ ఆధ్వర్యంలో ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో సీహెచ్‌వో భాస్కర్, హెల్త్ సూపర్‌వైజర్లు కె.పెద్దపుల్లయ్య, భద్రమ్మ, కళావతి, రాజేశ్వరి పాల్గొన్నారు.

లక్ష్మీపురంలో పశువైద్య శిబిరం

కల్లూరు, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) మండలంలోని లక్ష్మీపురం గ్రామంలో బుధవారం ఉచిత పశువైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని పశువైద్యాధికారి మమత ప్రారంభించి మాట్లాడారు. ఈ కార్యక్రమలో వీఎల్వో శ్రీనివాసరావు తదితరులున్నారు.

ప్రమాదకరంగా బోనకల్ చౌరస్తా

» అవస్థలు పడుతున్న వాహనదారులు

» రింగురోడ్డు ఏర్పాటు చేయాలని గ్రామస్థుల వేడుకోలు



బోనకల్ చౌరస్తాలో ఇష్టానుసారంగా వెళ్తున్న వాహనాలు

బోనకల్, నవంబరు20(ఆంధ్రజ్యోతి): బోనకల్ చౌరస్తా వాహనదారులకు గండంగా మారింది. నిత్యం ఈ మార్గంలో ప్రయాణించే వారు భయం భయంగా వెళ్తున్నారు. బోనకల్ గ్రామ పంచాయతీ కార్యాలయం ఎదురుగా వైరా- జగ్గయపేట ప్రధాన రహదారి ఉంది. బోనకల్ గ్రామం వద్ద రైల్వే గేటు ఉండటంతో గత 2009లో ఆర్వోబీ నిర్మాణం చేపట్టారు. ఆర్వోబీకి రెండు వైపులా సర్వీసు రోడ్లతో పాటు బోనకల్ గ్రామం నుంచి ప్రధాన రహదారికి చేరుకునే రోడ్డు మార్గం కూడా పంచాయతీ కార్యాలయం వద్ద కలుస్తుండటంతో ఈ ప్రాంతం మూడు రోడ్ల జంక్షన్‌గా మారింది. వైరా-జగ్గయ్యపేట ప్రధాన రోడ్డు పై ఆర్వోబీ ఉండటంతో ఓవర్‌లోడ్‌తో వెళ్తున్న లారీలతో పాటు అతి వేగంతో ప్రయాణిస్తున్న వాహనాలు ఒకవైపు ప్రయాణిస్తుండగా, మరోవైపు ఖమ్మం నుంచి చిల్లకల్లు, విజయవాడ వైపుకు వెళ్లే వాహనాలు, బోనకల్, ఆళ్లపాడు, రాయనపేట, మోటమర్రి, కలకోట తదితర గ్రామాల ప్రజలు కూడా ఈ మార్గం గుండానే రాకపోకలు సాగిస్తున్నారు. వాహనాలన్నీ ఆర్వోబీ ప్రవేశం వద్దనే కలుస్తుండటంతో అతివేగంతో వచ్చే వాహనాల వలన పలు ప్రమాదాలు జరుగుతున్నాయి. గతంలో జరిగిన ప్రమాదాల్లో ఈ కూడలి ప్రాంతంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ ప్రదేశం వద్ద పలువురు ప్రమాదాలకు గురై గాయాల బారిన పడుతున్నారు. బోనకల్ చౌరస్తా వద్ద రింగురోడ్డు ఏర్పాటు చేస్తేనే ప్రమాదాలను అరికట్టే అవకాశం ఉంటుందని, రింగు రోడ్డుకు నిధులు మంజూరు చేయాలని ప్రజలు వేడుకుంటున్నారు. గతంలో ఆర్వోబీ నిర్మాణ డిజైనింగ్ సక్రమంగా చేయక పోవడం వలనే ప్రమాదాలు జరుగుతున్నాయని, ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రమాదాలు నివారించేందుకు తక్షణమే చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు.

సమస్యను పరిష్కరించాలి

●గంగుల నాగయ్య, బోనకల్ వాసి



బోనకల్ చౌరస్తా ప్రమాదకరంగా మారింది. నిత్యం వాహనాల రద్దీ ఎక్కువగా ఉండటంతో పాటు అతివేగంతో వస్తున్న వాహనాల వలన ఏ క్షణం ఏ ప్రమాదం జరుగుతుందోనని భయంగా ఉంది. పంచాయతీ కార్యాలయం వద్ద అన్ని రోడ్లు కలిసే ఈ ప్రాంతం వద్ద పలు ప్రమాదాలు జరుగుతున్నాయి. అందరి క్షేమం కోసం ఇక్కడ రింగు రోడ్డు ఏర్పాటు చేయాలి. అధికారులు తక్షణమే స్పందించి సమస్యను పరిష్కరించాలి.

విద్యార్థులను ఆరోగ్యవంతులుగా చేయడమే లక్ష్యం

» రాష్ట్ర ఫుడ్ కమిటీ సభ్యులు ఓరిగంటి ఆనంద్, భూక్యా జ్యోతి



వంటలను పరిశీలిస్తున్న ఫుడ్ కమిటీ సభ్యులు

ఏన్కూరు, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులను సంపూర్ణ ఆరోగ్యవంతులుగా చేయడమే ఫుడ్ కమిటీ ఉద్దేశ్యమని రాష్ట్ర ఫుడ్ కమిటీ సభ్యులు ఓరిగంటి ఆనంద్, భూక్యా జ్యోతి తెలిపారు. బుధవారం ఏన్కూరు హరిజనవాడ అంగన్‌వాడీ కేంద్రం, కస్తూర్బావిద్యాలయం, హిమాంనగర్‌లోని చౌకదుకాణం పరిశీలించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థుల భోజనాల్లో నాణ్యత పాటించేందుకు ముమ్మరంగా తనిఖీలు చేస్తున్నట్టు తెలిపారు. ఈకార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ పి.శ్రీనివాసరెడ్డి, డీఈవో సోమశేఖరశర్మ, సివిల్ సప్లయి డీఎం జి.శ్రీలత, డీఎస్‌వో చందన్‌కుమార్, ఆర్డీవో రాజేందర్, జిల్లా వెల్ఫేర్ ఆఫీసర్ నాగేదర్‌రెడ్డి, డీఎంవో రాజశేఖర్ సీడీపీవో దయామణి, తహసీల్దార్ శేషగిరిరావు, ఎంపీడీవో రమేష్, ఎంఈవో శ్రీనివాస్, వైద్యాధి కారి రాములు, సీహెచ్‌వో శివరాజు పాల్గొన్నారు.

మెరుగైన ఫలితాల కోసం ప్రత్యేక ప్రణాళిక: డీఈవో

ఏన్కూరు, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): పదో తరగతిలో మెరుగైన ఫలితాల కోసం ప్రత్యేక ప్రణళిక రూపొందించినట్టు డీఈవో సోమశేఖరశర్మ తెలిపారు. బుధవారం ఏన్కూరు కేజీబీవీ విద్యాలయాన్ని సందర్శించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పదో విద్యార్థులకు ఉదయం సాయంత్రం ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. డిసెంబరు చివరి నాటికి సిలబస్‌పూర్తి కానున్నట్టు తెలిపారు ఈకార్యక్రమంలో డీఎంవో రాజశేఖర్, ఎంఈవో శ్రీనివాస్ కేజీబీవీ ఎస్‌వో లావణ్య, కాంప్లెక్స్ హెచ్ఎం సైదయ్య తదితరులు పాల్గొన్నారు.

రైతులను ఇబ్బందులకు గురి చేయొద్దు: ఆర్డీవో

ముదిగొండ, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): తేమశాతం పేరుతో పత్తి రైతులను ఇబ్బందులకు గురిచేయకుండా నిబంధనల ప్రకారం పూర్తి పారదర్శకంగా ప్రక్రియను కొనసాగించాలని ఖమ్మం ఆర్డీవో నర్సింహారావు సీసీఐ సిబ్బందిని ఆదేశించారు. బుధవారం మండల పరిధిలోని న్యూలక్ష్మీపురంలో గ్రామంలో ఉష శ్రీ జిన్నింగ్‌మిల్లులో ఏర్పాటు చేసిన పత్తి కొనుగోలు కేంద్రాన్ని తనిఖీ చేశారు. రైతులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. జిన్నింగ్ మిల్లు నిర్వాహకులు రైతులను రాత్రి సమయంలో ట్రాక్టర్లను బయటే ఉంచుతున్నారనే చెప్పడంతో నిర్వాహకులతో మాట్లాడి రైతులకు ఎలాంటి భద్రతా ఇబ్బంది లేకుండా లోపలికి అనుమతించాలని ఆదేశించారు. అనంతరం అదే గ్రామంలో జరుగుతున్న సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేను పరిశీలించారు. కార్యక్రమంలో తహసీల్దార్ సునీతా ఎల్జిబెత్, ఆర్ఐలు వహీదా, ప్రసన్నకుమార్, నేలకొండ ఏఎంసీ సెక్రటరీ వి.నాగేశ్వరి, జిన్నింగ్‌మిల్లు నిర్వాహకుడు రమేష్, పంచాయతీ సెక్రటరీ దేగల సురేష్ తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం సక్రమంగా అందించాలి: డీపీవో

ఎర్రుపాలెం, నవంబరు20(ఆంధ్రజ్యోతి): మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనాన్ని సక్రమంగా అందించాలని జిల్లాపంచాయతీ అధికారి ఆశాలత అన్నారు. బుధవారం మండలంలోని మీనవోలు గ్రామంలో జిల్లా పరిషత్ పాఠశాలలో ప్రభుత్వం విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలన్నారు. ఈకార్యక్రమంలో ఖమ్మం డివిజనల్ పంచాయతీ అధికారి రాంబాబు, ఎర్రుపాలెం మండల పంచాయతీ అధికారి గంధం శ్రీలక్ష్మి, మీనవోలు కార్యదర్శి బానోతు శివుడు పాల్గొన్నారు.

పంట వ్యర్థాలే పొలానికి ఎరువు

» ఏడీఏ విజయ్ చంద్ర



రైతులతో మాట్లాడుతున్న ఏడీఏ విజయ్‌చంద్ర

చింతకాని, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): పంట వ్యర్థాలను కాల్చొద్దని వాటిని భూమిలో కలియదున్నడం వలన ఎరువుగా మారుతుందని మధిర సహాయ వ్యవసాయ సంచాలకులు ఎస్ విజయ్ చంద్ర రైతులకు సూచించారు. బుధవారం మండల పరిధిలోని పలు గ్రామాల్లో రైతుల వ్యవసాయ క్షేత్రాలను ఆయన సందర్శించారు. నేరడ గ్రామంలో ఓ రైతు పత్తి పంటను కాల్చుతుండటంతో రైతుకు అవగాహన కల్పించారు. పంట అవశేషాలను భూమిలో కలియదున్నడం ద్వారా కుల్లి భూసారం పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఏవో ఎస్ మానస, ఏఈవో రాము, రైతులు పాల్గొన్నారు.

సర్వేను త్వరితగతిన పూర్తి చేయాలి

వైరా, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేను త్వరితగతిన పూర్తి చేయాలని వైరా నియోజకవర్గ ప్రత్యేక అధికారి, ఖమ్మం డీఎల్‌పీవో రాంబాబు ఆదేశించారు. బుధవారం మండలంలోని రెబ్బవరం గ్రామంలో ఎంపీవో జ్యోత్స్నదేవితో కలిసి సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేను రాంబాబు పరిశీలించారు. ప్రస్తుతం జరుగుతున్న సర్వే పట్ల ఆరా తీశారు. సర్వేను పకడ్బందీగానిర్వహించాలని ఆదేశించారు. ఆయన వెంట రెబ్బవరం సెక్రటరీ కృష్ణ, ఎన్యుమరేటర్లు పాల్గొన్నారు.

బోనకల్‌లో 72 శాతం పూర్తి

బోనకల్, నవంబరు20(ఆంధ్రజ్యోతి): మండలంలో సమగ్ర కుల గణన సర్వే 72 శాతం పూర్తైందని తహసీల్దార్ పున్నమ్ చందర్ తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం సూపర్‌వైజర్లతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 23వ తేది నాటికి సమగ్ర కుల గణన సర్వేను పూర్తి చేయాలని సూచించారు. ఈ సమావేశంలో ఎంపీడీవో ఆర్. రమాదేవి, ఎంఈవో దామాల పుల్లయ్య, ఎంపీవో శాస్త్రీ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు అండగా నిలబడితేనే నాయకుడిగా గుర్తింపు

» సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు బెజవాడ రవిబాబు

మధిర, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): పార్టీ నాయకులు సమస్యలపై స్పందించే తత్వం అలవర్చుకోని ప్రజలకు అండగా నిలబడితేనే గుర్తింపు లభిస్తుందని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు బెజవాడ రవిబాబు అన్నారు. బుధవారం మధిర ఆర్టీసీ ఎంప్లాయిస్ కార్యాలయంలో జరిగిన సీపీఐ పార్టీ ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు మడుపల్లి లక్ష్మణ్, ఎరుమాళ్లపల్లి ప్రకాశరావు, రహీం, మంగళగిరి రామానుజం చెరుకూరి వెంకటేశ్వరరావు, తలారి రమేష్, శిలివేరు శ్రీనివాసరావు, అన్నవరపు సత్యనారాయణ ఊట్ల కామేశ్వరరావు, అప్పారావు, బ్రహ్మం తదితరులున్నారు.

ఆస్పత్రి నిర్మాణం కోసం భూమి పరిశీలన

ఎర్రుపాలెం, నవంబరు20(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం ఎర్రుపాలెం గ్రామంలో నూతనంగా నిర్మించే 30పడకల ప్రభుత్వ ఆసుపత్రి నిర్మాణం కోసం ప్రభుత్వ భూమిని వైద్యశాఖ అధికారులు బుధవారం పరిశీలించారు. ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ప్రతిపాదించిన 30 పడకల ఆస్పత్రి నిర్మాణం కోసం ఆయన ఆదేశాలమేరకు ఎర్రుపాలెం తహసీల్దార్ కార్యాలయానికి దగ్గరలో గల ప్రభుత్వ భూమి సర్వేనెంబరు 20లో 3 ఎకరాల భూమిని జిల్లా ఆసుపత్రి సేవల కో ఆర్డినేటర్ డాక్టర్ రాజశేఖర్‌గౌడ్ పరిశలించారు. ఈమేరకు తహసీల్దార్ ఉషాశారద సంబంధిత భూమి పరిస్థితులు, సరిహద్దులను ఆయనకు వివరించారు. ఈకార్యక్రమంలో ఆర్ఐలు రవికుమార్, రాజశేఖర్, సర్వేయర్ రాజశేఖర్, మధిర ప్రభుత్వ ఆసుపత్రి వైద్యుడు డాక్టర్ అనరిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి చెక్కు పంపిణీ

మధిర, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): రాజ్యసభ సభ్యురాలు రేణుకచౌదరి సిఫార్సుతో మంజూరైన సీఎం సహాయనిధి చెక్కు రూ.44,000లను లబ్దిదారు కొండలరాణికి బుధవారం మధిరలోని రేణుక చౌదరి వర్గం కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ మాజీ మండల అధ్యక్షుడు జవ్వాజి ఆనందరావు అందజేశారు. ఈకార్యక్రమంలో డీసీసీ కార్యదర్శి కర్లపూడి అప్పారావు, నియోజకవర్గ యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షులు దోర్నాల రవి, ఆవుల గురుబ్రహ్మం, జల్లేపల్లి ప్రసాద్, రావుట్ల పుల్లాచారి, తదితరులు పాల్గొన్నారు.

'నేను, నా మధిర' కార్యక్రమం ప్రారంభం

మధిరటౌన్, నవంబరు20(ఆంధ్రజ్యోతి): ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ప్రతిష్టాత్మకంగా తీసుకున్న నేను నా మధిర క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమాన్ని బుధవారం పట్టణంలో పలు వార్డుల్లో చేపట్టారు. 9వ వార్డులో కౌన్సిలర్ మల్లాది సవిత రోడ్ల వెంబడి ఉన్న చెత్తను తొలగించే కార్యక్రమంలో పాల్గొనగా 21 వ వార్డులో కౌన్సిలర్ యర్రగుంట లక్ష్మీ మురుగు కాల్వలను శుభ్రపరిచే కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

లగచర్ల రైతులను విడుదల చేయాలి

» లంబాడీ హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు దశరథ్‌నాయక్

తల్లాడ, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): లగచర్ల ఘటన కేసులో అరెస్టు చేసిన లంబాడీ రైతులను బేషరత్‌గా విడుదల చేయాలని 8 లంబాడీ హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు దశరథ్‌నాయక్ అన్నారు. లగచర్ల సంఘటన నేపథ్యంలో బుధవారం తల్లాడ మండలం రంగంబంజర గ్రామంలో ఆయనతో పాటు మండల అధ్యక్షుడు భూక్యా రవినాయక్‌లను తల్లాడ పోలీసులు అరెస్టుచేశారు. ఈ సందర్భంగా దశరథ్‌నాయక్ మాట్లాడుతూ దాడికి కారకులైన వారిని శిక్షించాలన్నారు. లంబాడీ రైతులను పరామర్శించటానికి వెళ్తున్న తమను అరెస్టు చేయడం అన్యాయమన్నారు.

'చెరువుల నీటి వృథాను అరికట్టాలి'

తల్లాడ, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): మల్లవరంలోని పెద్దమాలకుంట, చిన్నమాలకుంట చెరువుల తూములకు షట్టర్లు ఏర్పాటుచేసి నీటి వృథాను అరికట్టాలని కోరుతూ ఐబీ తల్లాడ డీఈ శ్రీనివాసరాజుకు రైతులు వినతిపత్రం సమర్పించారు. నీటి వృథా వల్ల చెరువుల ఆయకట్టు పరిధిలోని వరిపైర్లకు సక్రమంగా నీరందక రైతులు నష్టపోతున్నారని వినతిపత్రంలో పేర్కొన్నారు. కార్యక్రమంలో రైతులు గాదె కృష్ణారావు, ఉయ్యూరు పవన్ తదితరులు పాల్గొన్నారు.

విజయడెయిరీ పాడిరైతుల సమావేశం

ఎర్రుపాలెం, నవంబరు20(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇనగాలి గ్రామంలో తిరువూరు క్లస్టర్ విజయడెయిరీ పాడిరైతుల సొసైటీ సమావేశం బుధవారం నిర్వహించారు. ఈసమావేశానికి తిరువూరు శీతలీకరణ కేంద్రం మేనేజర్ టి.సాంబశివమూర్తి మాట్లాడుతూ పాడిరైతుల అభివృద్ధి కోసం కృష్ణమిల్క్ యూనియన్ నిరంతరం పని చేస్తుందన్నారు. పాలరేటుపెంచేందుకు కృషిచేసిన కృష్ణా మిల్క్ యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులకు రైతులు కృతజ్ఞతలు తెలిపారు. అనతరం సొసైటీలో పాలుపోస్తున్న రైతు యరమల తిరపతిరెడ్డి కుమార్తె ప్రియాంక వివాహానికి కృష్ణమిల్క్ యూనియన్ అందిస్తున్న కళ్యాణమస్తు పథకం ద్వారా రూ.20వేల విలువిగల నాలుగు గ్రామాలు గోల్డ్‌కాయిన్‌ను అందించారు. ఈకార్యక్రమంలో పరిసర ప్రాంత సంఘ అధ్యక్షుడు చిన్న వెంకటేశ్వర్లు, టి.శ్రీనివాసరెడ్డి, జే.శ్రీనివాసరావు, బీవీ అప్పారావు, పరిసర ప్రాంత సంఘ వేతన కార్యదర్శులు సొసైటీ పాలకవర్గసభ్యులు తదితరులున్నారు.

రైతుల గురించి మాట్లాడే అర్హత బీఆర్ఎస్‌కు లేదు

» జిల్లా కాంగ్రెస్ కిసాన్‌సెల్ అధ్యక్షుడు మొక్కా శేఖర్‌గౌడ్



మాట్లాడుతున్న మొక్కా శేఖర్‌గౌడ్

వైరా, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రాన్ని పదేళ్లు పాలించి అన్నిరంగాల్లో దివాళా తీయించిన బీఆర్ఎస్‌కు రైతుల గురించి మాట్లాడే అర్హత లేదని జిల్లా కాంగ్రెస్ కిసాన్‌సెల్ అధ్యక్షుడు మొక్కా శేఖర్ గౌడ్ వ్యాఖ్యానించారు. వైరాలో బుధవారం జరిగిన రైతుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత పదేళ్ల బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రైతులకు ఎటువంటి రాయితీలు ఇవ్వలేదని, తరుగు పేరుతో రైతులను వేలకోట్లరూపాయల దోపిడీ చేశారని విమర్శించారు. రైతుల అభివృద్ధి, సంక్షేమ కోసం కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు బోళ్ల గంగారావు, పమ్మి అశోక్, ధార్న రాజశేఖర్, వేల్పుల భరత్, తేళ్లూరి వీరయ్య తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో స్పోర్ట్స్ కిట్ల పంపిణీ

వైరా, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువుల్లో రాణించి తల్లిదండ్రుల కలలు నెరవేర్చాలని జిల్లా యువత సాధికారిత ట్రైనింగ్ క్లాస్‌ల చైర్మన్ మదన్‌మోహన్, లయన్స్‌క్లబ్ జిల్లా మాజీ గవర్నర్ డాక్టర్ కాపా మురళీకృష్ణ పేర్కొన్నారు. వైరాలోని జడ్పీ బాలికోన్నత పాఠశాల, రెబ్బవరం హైస్కూల్‌కు రూ.20వేల విలువైన స్పోర్ట్స్ కిట్స్‌ను మదన్‌మోహన్, డాక్టర్ మురళీకృష్ణ బుధవారం అందజేశారు. కార్యక్రమంలో ఎంఈవో కొత్తపల్లి వెంకటేశ్వర్లు, ప్రధానోపాధ్యాయులు మల్లీశ్వరి, ఉండ్రు శ్యాంబాబు, లగడపాటి ప్రభాకర్‌రావు, అబ్బూరి రమేష్, పెనుగొండ ఉపేంద్రరావు, సీహెచ్.వెంకటేశ్వరరావు, మరికంటి రాంగోపాల్, ఉపాధ్యాయులు దొడ్డా వరప్రసాద్, జీవీ.సూర్యప్రకాశరావు, శిరీష, ప్రేమలీల తదితరులు పాల్గొన్నారు.

పెనుబల్లి, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): లయన్స్‌క్లబ్ ఆఫ్ సప్తపది ఆధ్వర్యంలో పీఎంజేఎఫ్ లయన్ మదన్‌మోహన్ రేపాల యూత్ ఎంపర్మెంట్ ఆర్థిక సహాయంతో వీఎంబంజర్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు రూ.9వేలు విలువ చేసే ఆటవస్తువులను వితరణ చేశారు. కార్యక్రమంలో డిస్ట్రిక్ట్ చైర్మన్లు మిట్టపల్లి జనార్ధన్, షేక్.అబ్దుల్‌కలాం, అధ్యక్షుడు చీదిరాల సుబ్బారావు, కార్యదర్శి మిట్టపల్లి శ్రీధర్, కోశాధికారి కారుమంచి ఆనంద్, హెచ్ఎం సత్యనారాయణ, పీఈటీ బండి రాము పాల్గొన్నారు.

తల్లాడ, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): తల్లాడ మండలంలోని అన్నారుగూడెం, తల్లాడ ఉన్నత పాఠశాలల్లో బుధవారం లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు స్పోర్ట్స్ కిట్లను పంపిణీ చేశారు. పీఎంజేఎఫ్ లయన్స్ మదన్‌మోహన్ రేపాల సారథ్యంలో విద్యార్థులకు స్పోర్ట్స్ కిట్లను అందజేశారు. లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు బెల్లంకొండ ఆంజనేయులు, డీసీ దారా శ్రీనివాసరావు, కార్యదర్శి కటికి వెంకటేశ్వర్లు, శీలం వెంకటరెడ్డి, తోట మురళీ పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ నాయకుడికి మందకృష్ణ మాదిగ పరామర్శ



వెంకటేశ్వర్లును పరామర్శిస్తున్న మందకృష్ణ మాదిగ

చింతకాని, నవంబరు20(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పొద్దుటూరు గ్రామానికి చెందిన ఎమ్మార్పీఎస్ నాయకుడు కట్ట వెంకటేశ్వర్లు ఇటీవల అనారోగ్యంతో శస్త్రచికిత్స పొంది ఇంటివద్ద విశ్రాంతి తీసుకుంటుండటంతో ఆయనను బుధవారం ఎమ్మార్పీస్ జాతీయ అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ పరామర్శించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు కూరపాటి సునీల్ మాదిగ, జాతీయ ఉపాధ్యక్షుడు ఇసినేపల్లి అశోక్ మాదిగ, ఎంఎస్‌పీ జిల్లా అధ్యక్షుడు ఏపూరి వెంకటేశ్వరరావు మాదిగ, బచ్చలకూర వెంకటేశ్వరరావు, చిర్రా ఉపేంద్ర పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని వినతి

వేంసూరు, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): యర్రగుంటపాడు యానాదుల కాలనీలో ఇళ్లు కూలిపోయే దశలో ఉన్నాయని వాటి స్థానంలో ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని డిమాండ్ చేస్తూ సీపీఐ ఆధ్వర్యంలో బుధవారం ఇన్‌చార్జ్ డీటీ చిరంజీవి, ఆర్ఐ శ్రీనివాసరాజుకు ఒక వినతిపత్రం సమర్పించారు.

పంటలకు మద్దతు ధర చెల్లించాలి

» అఖిలభారత ప్రగతిశీల రైతుసంఘం రాష్ట్ర నాయకుడు అచ్చయ్య

వైరా, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): రైతుల పంటలకు మద్దతు ధరలు చెల్లించాలని అఖిలభారత ప్రగతిశీల రైతుసంఘం రాష్ట్ర నాయకుడు గుర్రం అచ్చయ్య డిమాండ్ చేశారు. తమ సంఘం నాయకుల బృందంతో బుధవారం వైరా వ్యవసాయ మార్కెట్ యార్డులోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించారు. రైతుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మార్కెట్ కమిటీ సెక్రటరీకి వినతి పత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఆవుల వెంకటేశ్వర్లు, మలీదు నాగేశ్వరరావు, కోలేటి నాగేశ్వరరావు, పాశం అప్పారావు, సీవై.పుల్లయ్య, యలదండి బాబు పాల్గొన్నారు.

'ఉద్యమకారులకు ఇండ్ల స్థలాలు కేటాయించాలి'

తల్లాడ, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): తల్లాడ మండలంలోని తెలంగాణ ఉద్యమకారులు, జర్నలిస్టులకు స్థానిక రైతు వేదిక వద్దనున్న ఖాళీ స్థలంలో ఇండ్లస్థలాలు కేటాయించాలని కోరుతూ బుధవారం తహసీల్దార్ ఏవనజకు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మోదుగు ఆశీర్వాదం, తేళ్లపుట్ట వెంకటనారాయణ, లాలయ్య, వెంకటేశ్వర్లు, ఎక్కిరాల బాబు, ప్రసన్నకుమార్, నారపోగు ప్రసాద్, గొడ్ల శ్రీనివాసరావు, మేడి బసవయ్య పాల్గొన్నారు.

సింహగర్జన సభను విజయవంతం చేయాలి

మధిరటౌన్,నవంబరు20(ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ పెరేడ్ గ్రౌండ్స్‌లో డిసెంబర్ ఒకటిన నిర్వహించే మాల మహనాడు ఆధ్వర్యంలో జరిగే సింహగర్జన సభను విజయవంతం చేయాలని కోరుతూ బుధవారం మడుపల్లిలో సింహగర్జన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మాల లాయర్స్ అసోసియేషన్ సెక్రటరీ ప్రకాష్, రిటైర్డ్ ఎంపీడీవో మురహరిరావు, రాజేందర్ మాల మహనాడు నాయకులు పాల్గొన్నారు.

నేడు మధిరలో చెకుముకి టాలెంట్‌టెస్ట్

మధిర, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): మధిర సీపీఐ హైస్కూల్ నుందు పాఠశాల నందు ఈనెల 21వతేదీ గురువారం మండల స్థాయి చెకుముకి టాలెంట్ టెస్ట్ నిర్వహిస్తున్నట్లు జనవిజ్ఞానవేదిక అధ్యక్ష, కార్యదర్శులు ధనిశెట్టి బాస్కర్ రావు, ఎ. రవి ఒక ప్రకటనలో తెలిపారు.

సీపీఐ ఆధ్వర్యంలో ధర్నా

వేంసూరు, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన వాగ్దానాలను వెంటనే అమలుచేయాలని డిమాండ్ చేస్తూ సీపీఐ ఆధ్వర్యంలో బుధవారం స్థానిక మండలపరిషత్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ నాయకుడు దండు ఆదినారాయణ మాట్లాడారు. అనంతరం ఎంపీవో రంజిత్‌కుమార్‌కు వినతిపత్రం సమర్పించారు.

చేతిపంపులకు మరమ్మతులు

కల్లూరు, నవంబరు20(ఆంధ్రజ్యోతి) పట్టణంలో శిథిలమైన చేతి పంపులను బుధవారం అధికారులు మరమ్మతులు చేపట్టారు. గ్రామ పంచాయతీ ఈవో నందిశెట్టి నాగేశ్వరరావు సక్షంలో వాటిని ప్రారంభించారు. ఈ కార్యక్రమలో కాంగ్రెస్ నాయకులు యాసా శ్రీకాంత్, యస్‌కె బాజీ. ఉప్పు నరిసింహారావు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరు హెల్మెట్ ధరించాలి

● టౌన్ ఎస్ఐ సంధ్య

మధిర, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ ప్రమాదాల నివారణకు సురక్షిత ప్రయాణానికి విధిగా హెల్మెట్ ధరించాలని టౌన్ ఎస్ఐ సంధ్య సూచించారు. మధిర టౌన్ పోలీస్‌ల ఆధ్వర్యంలో ప్రమాదాల నివారణపై బుధవారం మధిరలో విద్యార్థులతో కలిసి అవగాహన ర్యాలీ నిర్వహించారు. వివిధ ట్రాఫిక్ రూల్స్‌పై అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. ఈకార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ ప్రకాశ్, కృష్ణ, సైదులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

కన్నులపండువగా మహా పడిపూజ మహోత్సవం



పడిపూజలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే సండ్ర

సత్తుపల్లి, నవంబరు20(ఆంధ్రజ్యోతి): మహా పడి పూజా మహోత్సవం బుధవారం రాత్రి సత్తుపల్లిలో వైభవంగా నిర్వహించారు. స్థానిక జేవీఆర్ పార్క్ ఎదురుగా వేంచేసియున్న ఏకశిల పదునెట్టాంబడి శ్రీ హరిహరాత్మజ అయ్యప్పస్వామి దేవాలయంలో కన్నెస్వామి మునిసిపల్ చైర్మన్ కూసంపూడి మహేష్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన మహా పడిపూజ మహోత్సవం నేత్రపర్వంగా సాగింది. కేరళకు చెందిన మేలు తంత్రి బ్రహ్మశ్రీ చంద్రమౌళి వెంకటేష్ శర్మ గురుస్వామిచే ఈ కార్యక్రమం వైభవంగా సాగింది. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య హాజరై పడిపూజలో పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉత్సవ విగ్రహానికి నైవేద్యాలు సమర్పించి అభిషేకాలు చేశారు. ఆలయ ప్రధాన అర్చకులు వెంకట సురేష్ ఆచార్యులు, గురుస్వామి ద్రోణంరాజు మల్లికార్జున శర్మ, డోలక్ సుబ్బారావులచే నిర్వహించిన సంకీర్తనలతో అయ్యప్ప నామస్మరణతో మారుమ్రోగింది.

వైరాలో ఎక్సైజ్ వర్సెస్ మునిసిపల్

వైరా, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): వైరాలోని ఓ ప్రభుత్వ స్థలం విషయంలో స్థానిక మునిసిపల్, ఎక్సైజ్‌శాఖల మధ్య సమన్వయం కొరవడింది. ఫలితంగా ఆ రెండుశాఖల మధ్య వార్ తలెత్తింది. బుధవారం ఈ రెండుశాఖల మధ్య ఏర్పడిన వివాదం వెలుగులోకి వచ్చింది. వివరాలిలా ఉన్నాయి.

వైరాలోని శాంతినగర్ ఇందిరమ్మ కాలనీలో పదేళ్ల కిందట ఎక్సైజ్ స్టేషన్ నిర్మాణానికి స్థలాన్ని కేటాయించారు. ఆస్థలంలో ఎక్సైజ్‌శాఖ వారు బోర్డు ఏర్పాటుచేశారు. అయితే ఇంతవరకు ఎక్సైజ్ స్టేషన్ నిర్మించలేదు. అయితే శాంతినగర్‌లోని ఒకరిద్దరు ఈ స్థలం నుంచి రాకపోకలకు రహదారి సౌకర్యం కల్పించాలని ఎమ్మెల్యే రాందాస్‌నాయక్‌కు విజ్ఞప్తి చేశారు. అందుకు స్పందించిన ఎమ్మెల్యే ఈ సమస్యను పరిష్కరించాలని మునిసిపల్ అధికారులను ఆదేశించారు. దీంతో బుధవారం మునిసిపాలిటీకి చెందిన ఎక్స్‌కవేటర్‌తో రహదారి పనులు చేపట్టగా సమాచారం తెలుసుకున్న ఎక్సైజ్ సిబ్బంది అక్కడకు వెళ్లి పనులను అడ్డుకున్నారు. ఈ సమస్య ఎక్సైజ్, మునిసిపల్ శాఖల మధ్య వివాదంగా మారింది.